ప్రజాశక్తి

కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ సిరి, జెసి నూరుల్ కమర్, డిఆర్ఓ వెంకట నారాయణమ్మ

జీతాలు అందనట్లే..!

- ఉపాధ్యాయులకు పస్తులే
- శాలరీ బిల్స్ చేయని వైనం
- విద్యాశాఖ అధికారులపై మండిపాటు
- ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలి: యుటిఎఫ్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కొత్త సంవత్సరం 2026 ఆరంభంలోనే ఉపాధ్యాయులు జీతాలు అందక వస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటివరకు ఉపాధ్యాయుల జీతాల చెల్లింపునకు సంబంధించిన శాలరీబిల్స్ చేయలేదు. విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరి పట్ల ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కర్నూలు నగర కార్పొరేషన్ పరిధిలో దాదాపుగా 300 మందికి పైగా ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ప్రతి నెల ఉపాధ్యాయుల శాలరీ బిల్స్‌ను మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం నుండి పంపుతారు. డిసెంబర్ నెల కు సంబంధించిన శాలరీ బిల్స్‌ను ఇప్పటివరకు మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం నుండి ఖజానా శాఖకు చేరలేదు. అక్కనుండి ఖజానా శాఖకు చేరితేనే ఉపాధ్యాయులకు జీతాలు విడుదలవుతాయి. కర్నూలు కార్పొరేషన్ పరిధిలోని ఉపాధ్యాయులకు ప్రతినెల జీతాల బిల్లు చెల్లింపునకు తీవ్ర అవస్థలు పడుతున్నటువంటి పరిస్థితి నెలకొంది. ఇక్కడ కర్నూలు అర్బన్ మండల విద్యాశాఖ అధికారిగా పనిచేస్తున్న ప్రభావతమ్మ గత కొన్ని నెలలుగా అనారోగ్యానికి గురయ్యారు. అనంతరం ఆమెకు అదే స్థానంలో పోస్టింగ్ కల్పిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ప్రస్తుతం ఆమె కార్యాలయానికి వచ్చి ఫైళ్లు చూడలేనటువంటి పరిస్థితి ఉంది. విద్యాశాఖకు సంబంధించిన ఏమైనా పనులు ఉంటే కార్యాలయ సిబ్బంది ఆమె ఇంటి దగ్గరికి వెళ్లి చేయించుకొని వస్తున్నారు. ఉపాధ్యాయులకు సంబంధించిన సర్వీస్ రిజిస్టర్‌లో వివరాల నమోదుకు సంబంధించి పెండింగులో ఉన్నాయి. గత మూడు నెలల క్రితం సాలరీ బిల్లులను ఏదో విధంగా నెట్టుకొచ్చి పూర్తి చేశారు. ఇప్పుడు డిసెంబర్ నెలలో ఉపాధ్యాయులకు సంబంధించిన శాలరీ బిల్స్ చేయకపోవడంతో జీతాల కోసం జనవరి నెలలో గగ్గోలు పెట్టాల్సిన పరిస్థితి ఉంది. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకర్ దృష్టికి యుటిఎఫ్ ప్రతినిధి బృందం తీసుకువెళ్లింది. ఉపాధ్యాయులకు శాలరీ చెల్లింపునకు ఇతర సమస్యలు తలెత్తకుండా వెంటనే ఇక్కడికి కొత్త ఎంఇఒను నియమించాలని కోరారు.

కొత్త ఎంఇఒ ను నియమించాలి

- ఇబ్రహీం నగర ప్రధాన కార్యదర్శి యుటిఎఫ్

గత మూడు నెలలుగా విద్యాశాఖ ఉన్నతాధికారులు ఏదో విధంగా ఉపాధ్యాయుల జీతాల చెల్లింపునకు చర్యలు తీసుకున్నారు. ఇప్పుడు డిసెంబర్ నెలకు సంబంధించినది జీతాల బిల్లు చేయకపోవడంతో జనవరిలో జీతాలు అందని పరిస్థితి ఉంది. ఇక్కడ పనిచేస్తున్న ఎంఇఒ ప్రభావతమ్మ స్థానంలో కొత్త ఎంఇఒను నియమించాలి. ఉపాధ్యాయులు శాలరీ చెల్లింపుకు ఇబ్బంది లేకుండా చూడాలి.

పెట్రేగి పోతున్న వీధి కుక్కలు

- ఆందోళనలో చిన్నారులు, వృద్ధులు

ప్రజాశక్తి-పత్తికొండ

వీధి కుక్కలు పేట్రేగి పోవడంతో చిన్నారులు, వృద్ధులు భయాందోళనకు గురవుతున్నారు. పత్తికొండ మండల పరిధిలోని 17 గ్రామ పంచాయతీలో హోసూరు, పుచ్చకాయలమాడ ,పత్తికొండ, పెద్దహుల్తి, చిన్న హుల్తి, జూటూరు దూదేకొండ తదితర గ్రామపంచాయతీలో విచ్చలవిడిగా వీధి కుక్కలు పెరిగిపోవడంతో రోడ్లపై వాహనదారులను, కాలినడకన వెళ్లే వారి పట్ల వెంటపడి కరుస్తున్నాయి. గడిచిన ఐదు నెలల కాలంలో పత్తికొండ ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లోని కుక్క కాటుకు 705 కేసులు నమోదైనట్లు వైద్య అధికారులు చెబుతున్నారు. గ్రామాలలో పంచాయతీ సెక్రటరీలు వీధి కుక్కలు కరుస్తున్నాయని చెప్పినా పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో కంటికి కునుకు లేకుండా కుక్కలు అరుస్తూ భయాందోళనకు గురవుతున్నామని గ్రామస్తులు చెబుతున్నారు. అనేకమంది చిన్నారులు ,వృద్ధులు కుక్కకాటుకు గురై అనేక ఇబ్బందులు పడుతున్నామని కన్నీరు మున్నీరవుతున్నారు. గత రెండు రోజుల క్రితం హోసూరు గ్రామంలో బాలిక ఇన్షా(4)పై కుక్క విచక్షరహితంగా దాడి చేసిందని తల్లిదండ్రులు ఏడుస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వీధి కుక్కల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజల విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజా ఆరోగ్యలపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఎవరూ పట్టించుకోలేదు

- షేక్ రజియా, హోసూర్ గ్రామం పత్తికొండ మండలం.

నా మనవరాలును గత రెండు రోజుల క్రితం తిక్కకుక్క విచక్షరహితంగా దాడి చేసికరిచింది. అధికారులకు ఫోన్ చేసినా ఎవరు పట్టించుకోలేదు. ప్రభుత్వ అధికారులకు ప్రజలు ఆరోగ్యలపై దృష్టి లేదని స్పష్టంగా అర్థమవుతుంది. మా పాప కోలుకుంటే చాలు.

ప్రత్యేక చర్యలు తీసుకుంటాం

- ఎంపిడిఒ కవిత రెడ్డి

ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాం. చిన్నారులను వృద్ధులను వీధి కుక్కలు ఇబ్బందులు పెడుతున్నాయని మా దృష్టికి వచ్చింది. ఇఒఆర్ డి, పంచాయతీ సెక్రెటరీ తిక్క కుక్కలను గుర్తించామని చెప్పాం. మరో రెండు రోజుల్లో వాటిని తరలిస్తాం.

తెగ తాగేశారు..!

- రెండు రోజుల్లోనే రూ.17 కోట్ల మద్యం విక్రయాలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

నూతన సంవత్సర వేడుకల దృష్ట్యా డిసెంబర్ 31, జనవరి 1న మద్యం షాపులు, బార్లలో ప్రభుత్వం మద్యం విక్రయాలకు రాత్రి 12 గంటల వరకూ సమయం పొడిగించడంతో మద్యం విక్రయాలు జోరందుకున్నాయి. నూతన సంవత్సరం సందర్భంగా కర్నూలు జిల్లాలో మద్యం విక్రయాలు జోరుగా సాగాయి. డిసెంబర్ 30, 31 తేదీల్లో రెండు రోజుల్లోనే సుమారు రూ.17 కోట్ల మద్యం విక్రయాలు సాగినట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు. గత ఏడాది కంటే ఈ ఏడాది రూ.2 కోట్లు ప్రభుత్వానికి అధిక ఆదాయం సమకూరింది. మొత్తం అమ్మకాల్లో 30 శాతం బీర్లను కొనుగోలు చేశారు. ఈ సారి ఇతర మద్యం కంటే బీర్ల విక్రయాలే అధికంగా నమోదయ్యాయి.

జిల్లాను అగ్రగామిగా నిలుపుదాం

- జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి
- కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు జిల్లాను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుపుదామని జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి అధికారులకు పిలుపునిచ్చారు. గురువారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, డిఆర్ఒ సి.వెంకట నారాయణమ్మ, జిల్లా అధికారులు, ఇతర సిబ్బంది జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జాయింట్ కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ ను జిల్లా అధికారులు, రెవిన్యూ శాఖ అధికారులు, సిబ్బంది కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లా జడ్జికి, డిఐజికి ఎస్‌పి శుభాకాంక్షలు

- డిఐజిగా పదోన్నతి స్వీకరించిన విక్రాంత్ పాటిల్
- అభినందనలు తెలిపిన జిల్లా జడ్జి, కర్నూలు రేంజ్ డిఐజి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ ఎస్‌పి స్థాయి నుండి డిఐజిగా పదోన్నతి స్వీకరించారు. ఈ సందర్భంగా గురువారం జిల్లా జడ్జి కబర్ధిని, కర్నూలు రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్‌లను డిఐజి విక్రాంత్ పాటిల్ మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. డిఐజిగా పదోన్నతి స్వీకరించిన విక్రాంత్ పాటిల్‌కు జిల్లా జడ్జి, కర్నూలు రేంజ్ డిఐజి అభినందనలు తెలిపారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలో విక్రాంత్ పాటిల్‌ను అడిషనల్ ఎస్‌పిలు, డిఎస్‌పిలు, సిఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, డిపిఒ మినిస్టిరియల్ సిబ్బంది, ఇతర శాఖల సిబ్బంది కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా ఎస్‌పి క్యాంపు కార్యాలయంలో డిఐజి విక్రాంత్ పాటిల్, కర్నూలు 2 వ బెటాలియన్ కమాండెంట్ దీపికా పాటిల్ కలిసి కుటుంబ సమేతంగా కేక్ కట్ చేసి స్పెషల్ బ్రాంచ్ సిబ్బందికి, క్యాంపు కార్యాలయంలోని సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లా జడ్జి కబర్ధికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్పీ

డిఐజి కోయ ప్రవీణ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్పీ

ఒకేషనల్ ప్రిన్సిపల్‌కు నోబుల్ వరల్డ్ రికార్డ్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జాతీయ స్థాయి యువ నాయకత్వ కార్యక్రమం (లార్జెస్ట్ నేషనల్ యూత్ లీడర్‌షిప్ ఇనిషియేటివ్)లో అసాధారణ సేవలకు ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. నాగస్వామి నాయక్‌కు 'నోబెల్ వరల్డ్ రికార్డు' అవార్డు లభించింది. గురువారం ఈ అవార్డును జిల్లా వృత్తి విద్యా అధికారి సురేష్ బాబు, కర్నూలు, నంద్యాల ఎంపీలు బస్తిపాటి నాగరాజు, బైరెడ్డి శబరి , పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి చేతుల మీదుగా డాక్టర్ నాగస్వామి నాయక్ అవార్డు స్వీకరించారు. ఈ విశిష్ట గౌరవం సందర్భంగా కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది అందరూ ప్రిన్సిపల్‌ను అభినందించారు.

ఎమ్మెల్యే గౌరు చరిత దంపతుల చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపల్ నాగస్వామినాయక్

ఎంఎ.గఫూర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

సిపిఎం కేంద్రకమిటీ మాజీ సభ్యులు, కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్‌కు పలువురు పూలమాలవేసి 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సిపిఎం ఓల్డ్ సిటీ, న్యూ సిటీ కార్యదర్శులు ఎం. రాజశేఖర్, టి.రాముడు, జిల్లా కమిటీ సభ్యులు గురుశేఖర్ బుధవారపేట పార్టీ సభ్యులు సామేల్, బుషపోగు లక్ష్మన్న ,మద్దిలేటి, రమేష్, సుధాకర్, అంజి నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె. రామకృష్ణ,సిఐటియు న్యూ సిటీ కార్యదర్శి నరసింహులు, సాయిబాబా శేషాద్రి ,సుధాకర్ తదితరులు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే గఫూర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు రాజశేఖర్, టి.రాముడు తదితరులు

సిపిఎం జిల్లా కార్యదర్శికి శుభాకాంక్షలు

సిపిఎం కర్నూలు జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ కి, సిపిఎం ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం రాజశేఖర్ పూలమాలవేసి 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సిపిఎం బుధవార్ పేట పార్టీ సభ్యులు ఎస్. సామేల్, బుషపోగు లక్ష్మన్న ,మద్దిలేటి, రమేష్, సుధాకర్ ,అంజి ఉన్నారు.

గౌస్‌దేశాయికి , రాజశేఖర్‌కు స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

కార్మికుల అభ్యున్నతికి ప్రాధాన్యత

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నగరపాలక సంస్థలో పనిచేస్తున్న కార్మికుల అభ్యున్నతికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. గురువారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని తన నివాస కార్యాలయంలో కార్మికులకు మిఠాయి బాక్సులు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అంతకన్నా ముందు కమిషనర్ తన సతీమణి పి.చంద్రకళతో కలిసి కార్మికులకు అల్పాహారం వడ్డించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజారోగ్యం, ప్రాథమిక మానవ అవసరాలను సమర్థవంతంగా తీర్చడంలో కార్మికుల పాత్ర అమూల్యమైనదని పేర్కొన్నారు. అందుకే వారి సంక్షేమానికి నగరపాలక సంస్థ ఎప్పుడూ వెనకాడలేదన్నారు. కార్మికులకు వేతనాలు, కిట్లు వంటి సదుపాయాలు సకాలంలో అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. నూతన సంవత్సర వేడుకలను కార్మికులతో కలిసి జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో కూడా కార్మికుల అభ్యున్నతికి చట్టపరిధిలో సాధ్యమైన అన్ని సౌకర్యాలు ఎటువంటి జాప్యం లేకుండా కల్పించేందుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. అదేవిధంగా తహశీల్దార్ రవికుమార్, అదనపు కమిషనర్ ఆర్‌జివి.కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ ఎన్.చిన్నరాముడు, కార్యదర్శి నాగరాజు, డిసిపి వెంకటరమణ, ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగశివ ప్రసాద్, ఇంచార్జి ఎస్ఇ శేషసాయి, అకౌంట్స్ ఆఫీసర్ మురళి, ఎగ్జామినర్ సుబ్రహ్మణ్యం, ఆర్ఓలు జునైద్, ఇశ్రాయేలు, డిప్యూటీ తహశీల్దార్ ధనుంజయ, సూపరింటెండెంట్లు సుబ్బన్న, రామకృష్ణ, మంజూర్ బాష, వివిధ శాఖల అధికారులు, కార్పొరేటర్లు, కాంట్రాక్టర్లు, ప్రజాశక్తి జనరల్ మేనేజర్ నరసింహ, డెస్క్ ఇన్‌ఛార్జి పానుగంటి చంద్రయ్య, సిబ్బంది ,విలేకరులు కమిషనర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపిటిసి ఈరన్నగౌడ్, సిపిఎం నేత జె.మోహన్

వామపక్ష కార్మికుల నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి-సి బెళగల్

సి బెళగల్ మండలంలోని సిఐటియు,ఎఐటియుసి, హమాలీ వామపక్ష కార్మిక సంఘాలు గురువారం 2026 నూతన సంవత్సర వేడుకలు ఘనంగా చేపట్టారు. ఇందుకు సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి జె మోహన్ హాజరై కేక్ ను కట్ చేయడంతో ఒకరినొకరు తినిపించుకొని సంబరాలను చేసుకున్నారు. ఇక్కడే మోహన్ మాట్లాడుతూ ఈ ఏడాది సమస్యల పరిష్కారం కోసం చేపట్టబోయే కార్యక్రమాల్లో కార్మికులు చురుక్కా పాల్గొని ఉద్యమించాలని కోరారు. హమాలీ నాయకులు అక్బర్, మల్లికార్జున, జైలు, గోపాల్, నాగన్న, పక్కీరప్ప, సోమప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ : 2026 క్యాలెండర్ ను ఎంపిటిసి ఈరన్న గౌడ్, టిడిపి నాయకులు ధనుంజయ్, సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి జె మోహన్, భగత్ సింగ్ అసోసియేషన్ నాయకులు పోలాసి వెంకటేష్, పరమేష్ లు గురువారం లైబ్రరీ లో ఘనంగాఆవిష్కరించారు. దినాలు, నెలలు, సమయాన్ని తెలిపేది కాలామాన పత్రికలేనని పలువురు పేర్కొన్నారు.

కలెక్టర్‌కు బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్న జి.రామకృష్ణ

కలెక్టర్‌కు ఎపి రైతు సంఘం శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

2026 జనవరి ఒకటో తేదీన ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ డాక్టర్ ఎ.సిరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ, జిల్లా నాయకులు జి ఆంజనేయులు, కర్నూలు మండలం గౌరవ అధ్యక్షులు ఈ తాండ్రపాడు సర్పంచి బాలపీర , రైతు నాయకులు కాజాపీరా, ఈశ్వరయ్య, మహేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఇంట నూతన సంవత్సర సంబరాలు

ప్రజాశక్తి-కోడుమూరు

కోడుమూరు నియోజవర్గ ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి స్వగృహంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. నియోజకవర్గంలోని పలువురు టిడిపి నేతలు ఎమ్మెల్యేను పూలమాలతో సత్కరించి ఆయనతో కేక్ కటింగ్ చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నియోజకవర్గంలోని టిడిపి శ్రేణులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజలు రైతాంగం అన్ని రంగాలకు చెందిన ప్రతి ఒక్కరూ దినదిన అభివృద్ధి చెందాలని, అన్ని వర్గాల ప్రజల సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.



కార్యక్రమంలో కోడుమూరు మండల ప్రధాన కార్యదర్శి వెంకటగిరి రాజు, రవీంద్ర గౌడ్, పురుషోత్తం రెడ్డి, జిల్లా వికలాంగుల సంఘం అధ్యక్షులు సురేష్, పట్టే మధు తదితరులు పాల్గొన్నారు.

అనుభవజ్ఞులైన అధ్యాపకులతో యూనివర్సిటీ అభివృద్ధి

క్లస్టర్ వర్సిటీ న్యూఇయర్ వేడుకలో విసి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

క్లస్టర్ యూనివర్సిటీలో నూతన సంవత్సర వేడుకలు సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ కళాశాల ఆడిటోరియంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిజిస్ట్రార్ డాక్టర్ జి. శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన విసి వి.వెంకట బాసవరావు కేక్ కట్ చేయడం ద్వారా వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ యూనివర్సిటీ అభివృద్ధికి సంబంధించిన భవిష్యత్తు వ్యూహాలను, 12 బి ప్రణాళికలను వివరించారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉండడం వలన భవిష్యత్తులో క్లస్టర్ యూనివర్సిటీ భవిష్యత్తులో ఒక ఉన్నత విద్యాలయంగా వెలుగొందుతుందని ఆశాభవాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గవర్నమెంట్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఇందిరాశాంతి, కెవిఆర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకట రెడ్డి, డీన్లు డాక్టర్ నాగరాజ్ శెట్టి, డాక్టర్ అక్తర్ బాను, డాక్టర్ మహమ్మద్ వాహిజ్ , ఒఎస్‌డి డాక్టర్ ఎస్ఎం. బాష, డాక్టర్ వింధ్యా వాసినిలు పాల్గొన్నారు.

క్లస్టర్ యూనివర్సిటీ లో న్యూఇయర్ వేడుకలో మాట్లాడుతున్న విసి

విశ్వవిద్యాలయ అభివృద్ధికి కృషి

వైస్ ఛాన్సలర్ వెంకట బస్వరావ్

విశ్వవిద్యాలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని వైస్‌ఛాన్సలర్ వెంకట బసవరావు అన్నారు. గురువారం రాయలసీమ విశ్వవిద్యాలయంలో అర్ఇఎఫ్ రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ డైరీని వైస్ ఛాన్సలర్ వెంకట బస్వరావు రిజిస్ట్రార్ బి.విజయ్ కుమార్ నాయుడు ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవ సలహాదారుడు నాగభూషణం, అధ్యక్షులు సాంబశివరాజు, నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ గౌరవ అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, మీనాక్షి రెడ్డి, రంగనాథ్ గౌడ్, రమేష్ యాదవ్,మాలిక్, రవి ,బాబు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ యూనివర్సిటీలో డైరీని ఆవిష్కరిస్తున్న విసి బసవరావు

ప్రజల పత్రిక ప్రజాశక్తి

- క్యాలెండర్, డైరీని ఆవిష్కరించిన కలెక్టర్, ఎస్‌పి, తదితరులు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ప్రజల పత్రిక ప్రజాశక్తి అని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ సిరి, ఎస్‌పి విక్రాంత్ పాటిల్, జెసి నూరుల్ ఖమర్ తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా ప్రజాశక్తి క్యాలెండర్, డైరీని వారు ఆవిష్కరించారు. ప్రజాశక్తి సిబ్బందికి, విలేకరులకు అభినందనలు తెలిపారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు. కర్నూలు మున్సిపల్ కమిషనర్ పి విశ్వనాథ, డిఎంహెచ్ఓ డాక్టర్ ఎల్ భాస్కర్, ప్రముఖ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ బి శంకరశర్మ, నగరూరు సుబ్రమణ్యం ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ ఎన్ శమంతకమణి, క్రెడాయ్ జిల్లా అధ్యక్షులు నగరూరు శ్రీనివాసరావు, రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి పుల్లయ్య, ప్రయివేటు విద్యా సంస్థల గౌరవాధ్యక్షులు పిబివి సుబ్బయ్య, అగ్రసేని సంస్థల అధినేత బికె సింగ్, సీనియర్ న్యాయవాది వై జయరాజు, తదితరులు కూడా ప్రజాశక్తి క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. ప్రజాశక్తి జనరల్ మేనేజర్ టి నరసింహా, డెస్క్ ఇంఛార్జి పానుగంటి చంద్రయ్య, స్టాఫ్ రిపోర్టర్ ఎంయు వినయ్ కుమార్, ఎడిషన్ కమిటీ సభ్యులు ఎం రాజు, ఈ ఎల్లాగువేరా, సిబ్బంది నవీన్, మధు, రాకేష్, విలేకరులు యూసుఫ్ ఖాన్, చంద్రమోహన్, మునిస్వామి, తదితరులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ డాక్టర్ ఎ.సిని, నరసింహా తదితరులు

ప్రజాశక్తి క్యాలెండర్‌ను, డైరీని ఎస్‌పి విక్రాంత్ పాటిల్‌కు, కమిషనర్ విశ్వనాథ్‌కు, డిఎంహెచ్ఒ భాస్కర్‌కు అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రజాశక్తి సిబ్బంది

ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నగరూరు శమంతకమణి, శ్రీనివాసరావు, తదితరులు



ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ, నరసింహా , చంద్రయ్య తదితరులు

క్యాలెండర్‌ను, డైరీని జి. పుల్లయ్యకు అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రజాశక్తి సిబ్బంది

ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న రత్నమ్మ

పేదల పక్షపాతి.. ప్రజాశక్తి

- సొసైటీ ఛైర్మన్ రత్నమ్మ

ప్రజాశక్తి - ఆస్పరి

పేదల పక్షాన నిలుస్తూ ప్రజాశక్తి దినపత్రిక అందరి అభిమానాన్ని చూరగొందని సొసైటీ ఛైర్మన్ రత్నమ్మ, సొసైటీ మాజీ డైరెక్టర్ కృష్ణ తెలిపారు. గురువారం సొసైటీ కార్యాలయంలో ప్రజాశక్తి నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ... రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రజాశక్తి నిరంతరం కృషి చేస్తోందన్నారు. నిజాలను నిర్భయంగా రాస్తూ ఎన్నో సమస్యలను వెలికి తీస్తోందని తెలిపారు. పోటీ ప్రపంచంలో నిలుస్తూ ముందుకు సాగడం అభినందనీయమని కొనియాడారు. ఆలూరు మార్కెట్ యార్డు డైరెక్టర్ సుదర్శన్, సొసైటీ డైరెక్టర్లు సంజప్ప, మల్లికార్జున, సిఇఒ నరసింహులు, విలేకరి మురళీ, టిడిపి మాజీ కన్వీనర్ తిమ్మన్న, మండల కన్వీనర్ గోవిందు, టిడిపి నాయకులు రఘు, శీనప్ప, రాజశేఖర్, వీరేష్, మహేష్, నవీన్, కృష్ణ, హంపయ్య, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

లారీ ఢీకొని 52 గొర్రెలు మృతి

- 25 గొర్రెలకు గాయాలు

ప్రజాశక్తి - చిప్పగిరి

బస్టాప్ సమీపంలో మృత్యువాత పడ్డ గొర్రెల మంద

అతివేగం, అజాగ్రత్తగా వచ్చిన లారీ గొర్రెల మందపైకి దూసుకెళ్లిన ఘటనలో 52 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందగా, మరో 25 గొర్రెలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం తెల్లవారుజామున చిప్పగిరి పోలీసు స్టేషన్ పరిధిలోని కుందనగుర్తి గ్రామ బస్టాప్ సమీపంలో చోటు చేసుకుంది. ఆర్ఐ సునీత, సీనియర్ అసిస్టెంట్ రామాంజనేయులు, విఆర్ఒ చంద్ర నాయక్, పోలీసుల వివరాల మేరకు... అనంతపురం జిల్లా పామిడి మండలం అనుంపల్లి గ్రామానికి చెందిన ముసలప్పగారి రామచంద్ర జీవనంలో భాగంగా సుమారు 300 గొర్రెలను మేపుకుంటున్నారు. గొర్రెల మందను చిప్పగిరి నుంచి నేమకల్లు గ్రామానికి తోలుకుంటూ వెళ్తుండగా, తమిళనాడు రాష్ట్రానికి చెందిన టిఎన్ 93 బి 4779 నెంబరు గల లారీ చిప్పగిరి నుంచి ఆలూరు వైపు అతివేగంగా వెళ్తూ కుందనగుర్తి బస్టాప్ సమీపంలో గొర్రెల మందపైకి దూసుకొచ్చింది. ఈ ప్రమాదంలో 52 గొర్రెలు మృతి చెందడంతో రైతుకు దాదాపు రూ.5 లక్షల ఆర్థిక నష్టం వాటిల్లింది. గొర్రెల పెంపకమే జీవనాధారం కావడంతో తీవ్రంగా నష్టపోయినట్లు బాధితుడు వాపోయారు. ఘటనపై చిప్పగిరి పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'ఆదోని జిల్లా కోసం పోరాటం ఉధృతం'

ప్రజాశక్తి - కౌతాళం

మాట్లాడుతున్న నాయకులు

ఆదోని జిల్లా ఏర్పాటు కోసం పోరాటాలను ఉధృతం చేస్తామని ఆదోని జిల్లా సాధన జెఎసి నాయకులు నూర్ అహ్మద్ తెలిపారు. గురువారం కౌతాళంలో ఆయన మాట్లాడారు. కౌతాళం మండలంలో జెఎసిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కౌతాళంలోని ఆదోని జిల్లా ఉద్యమకారులతో చర్చించి కౌతాళంలో కార్యాచరణ ప్రణాళిక రచించాలని సూచించారు. వలసలతో మంత్రాలయం నియోజకవర్గంలోని గ్రామాలకు గ్రామాలు ఖాళీ అవుతున్నాయని, ఈ పరిస్థితి నుంచి బయటపడేందుకు, ఆదోని ప్రాంత ప్రజల దుస్థితిని తొలగించేందుకు, ప్రతి ఎకరాకు సాగునీరు అందించేందుకు, ఉపాధి అవకాశాలు, జిల్లా ఆస్పత్రి తదితర సౌకర్యాల కల్పనకు ఆదోని జిల్లా ఏర్పాటు అత్యవసరమని చెప్పారు. ఐకమత్యంతో పోరాడి ఈ ఏడాది ఆదోని జిల్లాను సాధించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. కౌతాళం నాయకులు శేషరెడ్డి, ఖాజా, జెఎసి నాయకులు నరేంద్ర యాదవ్, షకీల్, సద్దాం హుసేన్, కుమార్ పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

నూతన సంవత్సరం వేడుకల్లో భాగంగా కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజును కలిసి శుభాకాంక్షలు తెలిపినట్లు కురువ కార్పొరేషన్ ఛైర్మన్ మాన్వి దేవేంద్రప్ప, టిడిపి మండల అధ్యక్షులు కురువ శివప్ప గురువారం తెలిపారు. మండలంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లామని, సానుకూలంగా స్పందించారని చెప్పారు.

కుప్పగల్ రైల్వే స్టేషన్ వరకు బిటి రోడ్డు వేయాలి

- ఈఈకి సిపిఎం వినతి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మాధవరం రోడ్డులో పాండవగల్ సాయిబాబా గుడి దగ్గర నుంచి కుప్పగల్ రైల్వేస్టేషన్ వరకు లింకు రోడ్డు బిటి రోడ్డు వేయాలని సిపిఎం మండల కార్యదర్శి కె.లింగన్న కోరారు. గురువారం పంచాయతీరాజ్ ఈఈ డిసి.వెంకటేశులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆదోని, మాధవరం రోడ్డులో పాండవగల్ మీదుగా కుప్పగల్ వరకు ఉన్న మెటల్ రోడ్డును బిటి రోడ్డుగా చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఉరుకుంద, కౌతాళం ప్రాంతాలకు వెళ్లే భక్తులకు, వాహనదారులకు ఈ రోడ్డు చాలా దగ్గర అవుతుందని, నాలుగు కిలోమీటర్ల దూరం తగ్గుతుందని తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఈ రోడ్డుకు నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని కోరారు. ఈఈ మాట్లాడుతూ... ఈ రోడ్డు నిర్మాణం వల్ల చాలా ఉపయోగకరంగా ఉంటుందని, దీనికి ప్రతిపాదనలు పంపించి నిధులు మంజూరు చేసే దానికి ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. సిపిఎం మండల నాయకులు కె.పాండురంగ, శాఖ కార్యదర్శి అనీఫ్ బాషా, పార్టీ సభ్యులు నర్సిరెడ్డి, హనుమంతు రెడ్డి, భీమాంజనేయులు, హుస్సేని, హుస్సేని, ఆంజనేయ, రామాంజనేయులు, పక్కీరయ్య పాల్గొన్నారు.

ఈఈకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నూతన సంవత్సర వేడుకలకు దూరం

- కొనసాగుతున్న నిరవధిక దీక్షలు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని పెద్దహరివాణం గ్రామ ప్రజలంతా నూతన సంవత్సరాలకు వేడుకలకు దూరంగా ఉన్నారు. ఎన్నో రోజులుగా పోరాటాలతో సాధించుకున్న పెద్దహరివాణం మండలం కొందరు రాజకీయ నాయకుల కుట్రలు, కుతంత్రాలతో దక్కకపోవడంతో నూతన సంవత్సర వేడుకలకు దూరంగా ఉన్నారు. గ్రామంలో పిల్లల నుంచి పెద్దల వరకు ఎవరూ నూతన సంవత్సర వేడుకలు జరుపుకోలేదు. గురువారం మూడో రోజు నిరవధిక నిరాహార దీక్షలకు గ్రామస్తులు బింగి పూజారి లక్ష్మన్న, బింగి పూజారి పరమేష్, బింగి పూజారి మల్లికార్జున, జి.గర్జప్ప కూర్చున్నారు. వారికి సంఘీభావంగా పెద్దహరివాణం మండల కమిటీ సభ్యులు ఆదినారాయణ రెడ్డి, రాఘవేంద్ర ఆచారి, మెడికల్ నాగరాజ్, కుప్పలదొడ్డి గర్జప్ప, బింగి కర్రెప్ప, రేణుక చారి స్వామి, తిమ్మప్ప, బీపీ.వీరేశప్ప, మధు, నాగేంద్ర, నాగరాజు, ఎంకప్ప, రవి, నారాయణ, మర్రిస్వామి, ఏసప్ప గ్రామస్తులు పాల్గొని నిరవధిక దీక్షలను ప్రారంభించారు.

శిబిరంలో మాట్లాడుతున్న నాయకులు

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

- నాయకులకు శుభాకాంక్షల వెల్లువ

- ఎమ్మెల్యే డాక్టర్ బీవీ ఇంటి వద్ద సందడి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి ఇంటి వద్ద నూతన సంవత్సర వేడుకల సందడి నెలకొంది. గురువారం ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డికి శుభాకాంక్షలు తెలిపేందుకు నియోజకవర్గం నుంచి టిడిపి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, వ్యాపారులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పూలమాలలు, పుష్పగుచ్ఛాలను అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ బీవీ మాట్లాడుతూ... ప్రజలందరూ ఈ ఏడాది సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. డీఎస్పీ భార్గవి, పట్టణ సిఐ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ ఆది నగేష్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్ల చంద్రశేఖర్, మార్కెట్ యార్డు ఛైర్మన్ కురువ మల్లయ్య, టిడిపి మండల అధ్యక్షులు కెటి.వెంకటేష్, నాయకులు జగదీష్, మాజీ కౌన్సిలర్ రంగస్వామి గౌడ్, మాజీ కౌన్సిల్ పట్టణ ఉపాధ్యక్షులు కలీముల్లా, పట్టణ నాయకులు బందే నవాజ్, మైనార్టీ నాయకులు తురేగల్ నజీర్ అహ్మద్, కౌన్సిలర్ రాందాస్ గౌడ్, మునెప్ప నగర్ వార్డు నాయకులు మాబు, మూర్తి స్వామి, టిడిపి పట్టణ అధ్యక్షులు మహేష్, మాజీ కౌన్సిలర్ రామకృష్ణ, టౌన్ బ్యాంక్ డైరెక్టర్ కదిరికోట సాలెం అంబేద్కర్, కోఆపరేటివ్ ఛైర్మన్ అల్తాఫ్ పాల్గొన్నారు.

మంత్రాలయం : టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎన్.రాఘవేంద్ర రెడ్డికి టిడిపి శ్రేణుల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. మండలంలోని మాధవరం గ్రామంలోని ఆయన స్వగృహంలో ఆయనను, మాధవరం సర్పంచి ఎన్.రఘునాథ్ రెడ్డిని, మంచాల సొసైటీ ఛైర్మన్ ఎన్.రామకృష్ణారెడ్డిని, ఎన్.రాకేష్ రెడ్డిని, రాజారెడ్డిని శాలువా, గజమాలలు, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు.

ఆదోని : పట్టణంలో నూతన సంవత్సర వేడుకలు అంబరాన్నంటాయి. 2025 సంవత్సరానికి వీడ్కోలు పలికి బుధవారం అర్ధరాత్రి బాణసంచా పేల్చి 2026కు స్వాగతం పలికారు. కేకలు కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ చోటుచేసుకోకుండా డీఎస్పీ హేమలత ఆధ్వర్యంలో సిఐలు రాజశేఖర్ రెడ్డి, చంద్రశేఖర్, రామలింగయ్య, మహ్మద్ గౌస్ ఆధ్వర్యంలో పోలీసులు పర్యవేక్షణ నిర్వహించారు. పట్టణంలోని ఎమ్మెల్సీ బీటీ.నాయుడు నివాసం నాయకులు, కార్యకర్తల రాకపోకలతో కళకళలాడింది. మున్సిపల్ కమిషనర్ కృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ నాసిర్ హుస్సేన్, ఇంజినీర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉద్యోగులు ఆయనకు మొక్క అందజేశారు. అలాగే ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ నివాసంలో పూలమాల, శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపామని మున్సిపల్ కమిషనర్ కృష్ణ తెలిపారు. అలాగే టిడిపి జిల్లా అధ్యక్షులు గుడిసె ఆది కృష్ణమ్మ నివాసం నాయకులు, కార్యకర్తలతో సందడిగా మారింది. భారీ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. టిడిపి సీనియర్ నాయకులు సూరం భాస్కర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ రామచంద్ర ఆధ్వర్యంలో ఆమెకు పూలమాలలు వేసి శాలువాతో సన్మానించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఆమె నాయకులు, కార్యకర్తలకు సూచించారు. నాయకులు మాధవ్, మల్లేష్, నాగరాజు, మల్లికార్జున పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఛైర్మన్ సిహెచ్.లోకేశ్వరిని మున్సిపల్ కమిషనర్ కృష్ణ, ఇంజినీర్ సత్యనారాయణ శాలువా, పూలమాలతో సన్మానించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అలాగే మున్సిపల్ కమిషనర్ కృష్ణను ఉద్యోగులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పూలమాల, శాలువాతో ఆయనను సన్మానించి, కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అసిస్టెంట్ కమిషనర్ నాసిర్ హుస్సేన్, డిఇలు రామ్మూర్తి, రాజశేఖర్ రెడ్డి, ఉద్యోగులు ఉన్నారు. టిడిపి సీనియర్ నాయకులు, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ సూరం భాస్కర్ రెడ్డి కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. భాస్కర్ రెడ్డికి గజమాల వేసి అభిమానులు సన్మానించారు. నాయకులు సౌదీ రావుఫ్, వేణుగోపాల్ రెడ్డి, రామచంద్ర, నాగరాజు, మల్లికార్జున, రామకృష్ణ, సోమశేఖర్ రెడ్డి, రాముడు, మల్లేష్, శ్రీనివాసులు, శ్రీధర్, షేక్షావలీ ఉన్నారు.

ఆలూరు : కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడంతో రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉన్నారని టిడిపి ఇన్‌ఛార్జి వైకుంఠం జ్యోతి తెలిపారు. ఆలూరు ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్‌లో నూతన సంవత్సరం వేడుకలు నిర్వహించారు. టిడిపి నాయకులు, కార్యకర్తల మధ్య జ్యోతి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్ కేక్ కట్ చేశారు. అనంతరం బీసీ, ఎస్సీ బాలుర వసతి గృహంలో విద్యార్థులతో కలిసి వేడుకలు జరుపుకున్నారు.

చిప్పగిరి : టిడిపి శ్రేణులు భారీ ఎత్తున ఆలూరు గెస్ట్ హౌస్ ప్రాంగణానికి తరలివచ్చి వైకుంఠం జ్యోతి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు వారిని కలిసి పుష్పగుచ్ఛం, శాలువాలతో సన్మానించారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. బెల్డోన సొసైటీ ఛైర్మన్ కొండా రామాంజనేయులు, టిడిపి మండల కన్వీనర్ కొండా పురుషోత్తం, చిప్పగిరి సర్పంచి దాసరి గోవిందరాజులు, మండల మాజీ కన్వీనర్ వెంకటేశులు, అడ్వకేట్ షేక్షావలీ, పాముల సన్నప్ప, బెల్డోన గోవిందు, సంగాల భాస్కర్, చంద్ర, తిమ్మయ్య, సోమశేఖర్ నాయుడు, రామచంద్ర, ప్రభాకర్, అశోక్ యాదవ్, కొండా రాము, బోగేష్, జనార్ధన స్వామి, దౌల్తాపురం రామాంజనేయులు ఉన్నారు. వైకుంఠం జ్యోతి దంపతులకు తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛం అందజేశారు.

ఎంపిపి దంపతులకు సన్మానం

చిప్పగిరి ఎంపిపి జూటూరు హేమలత, మారయ్య దంపతులను గురువారం స్వగృహంలో శాలువా, పూలమాల వేసి ఇన్‌ఛార్జి ఎంపిడిఒ శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపిడిఒ నాగరాజు, సిబ్బంది కలిసి సన్మానించి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ, సిబ్బందికి ఎంపిపి జూటూరు హేమలత, మారయ్య కూడా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సీనియర్ అసిస్టెంట్ రామబ్రహ్మం, పంచాయతీ కార్యదర్శులు బాలన్న, జై రామ్ నాయక్ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు : వైసిపి కర్నూలు పార్లమెంట్ సమన్వయకర్త, మాజీ ఎంపీ బుట్టా రేణుకకు వైసిపి నాయకులు, కార్యకర్తలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని వైసిపి కార్యాలయంలో బుట్టా రేణుకను మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మైనారిటీ జిల్లా ఉపాధ్యక్షులు మహబూబ్ బేగ్, మాజీ కౌన్సిలర్ మధుబాబు, చేనేత మల్లికార్జున, సోషల్ మీడియా జిల్లా ఉపాధ్యక్షులు షేక్ చాంద్, ఇబ్రహీం, జశ్వంత్ పాల్గొన్నారు.

బుట్టా ప్రతుల్ ఆధ్వర్యంలో : పట్టణంలోని బుట్టా రేణుక కార్యాలయంలో వైసిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు బుట్టా ప్రతుల్‌కు వైసిపి నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేశారు. వైసిపి సీనియర్ నాయకులు, బుట్టా ఫౌండేషన్ అధినేత బుట్టా శివ నీలకంఠ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

దేవనకొండ : కప్పట్రాళ్ల బొజ్జమ్మ తన స్వగ్రామం జిల్లేడుబుడకలలో, టిడిపి మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్ టిడిపి కార్యాలయంలో, జడ్‌పిటిసి కిట్టు తన స్వగృహంలో వేడుకలు నిర్వహించారు. ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు పూలమాలలతో సన్మానించారు. మార్కెట్ యార్డు డైరెక్టర్ ఉచ్చీరప్ప, రామాంజనేయులు ఎంపిడిఒ జ్యోతికి పూలమాల వేసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. టిడిపి నాయకులు బడిగింజల రంగన్న, మాజీ ఎంపిటిసి ఆకుల వీరేష్, సర్పంచి భర్త బండ్లయ్య, టిడిపి కోకన్వీనర్ రాజాసాబ్ వేడుకలు చేసుకున్నారు. ముస్లిం, మైనారిటీ మండల నాయకులు ఈదులదేవర బండ సుభాన్‌కు టిడిపి కార్యకర్తలు పూలమాలలతో సన్మానించారు. టిడిపి మండల నాయకులు కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, పత్తికొండ ఎమ్మెల్యే కెఇ.శ్యాంబాబు, టిడిపి ఇన్‌ఛార్జి వైకుంఠం జ్యోతికి శుభాకాంక్షలు తెలిపారు.

ఆస్పరి : మండలంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిపి సుకర ఉమాదేవి అధికారులకు, ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఎంపిడిఒ గీతావాణి, డిప్యూటీ ఎంపిడిఒ విజయభాను, జడ్‌పిటిసి దొరబాబు, సర్పంచులు మూలింటి రాధమ్మ, హరికృష్ణ, తోయజాక్షప్ప, ఉప సర్పంచి వెంకటేశ్వరమ్మ, ఎంపిటిసి రాధాకృష్ణ, వైసిపి మండల మాజీ కన్వీనర్లు రామంజినేయులు, రాఘవేంద్ర, పెద్దయ్య పాల్గొన్నారు.

హాలహర్వి : మండలంలోని నిట్రవట్టి గ్రామంలోని సీజనల్ హాస్టల్‌లో నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. సీజనల్ హాస్టల్ ఉపాధ్యాయుడు కె.అయ్యన్న గౌడ్ విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు.

ఎమ్మెల్యే బీవీకి శుభాకాంక్షలు తెలుపుతున్న కమిషనర్ గంగిరెడ్డి

బుట్టా రేణుకకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

మంత్రాలయం

ఆదోని : ఎమ్మెల్సీ బీటీకి..

ఆదోని కృష్ణమ్మ భాస్కర్ రెడ్డి

ఆస్పరి : శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపిడిఒ



దేవనకొండ

చిప్పగిరి

ఆలూరు

భక్త జనసంద్రం.. మంత్రాలయం...

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయం భక్తజన సంద్రంగా మారింది. రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో కిటికటలాడింది. గురువారం రాఘవేంద్రస్వామి దర్శనం కోసం వచ్చిన భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకునేందుకు బారులు తీరారు. దేశ నలుమూలల నుంచి వచ్చిన భక్తులు తుంగభద్ర నదిలో పుణ్య స్నానాలు చేసి కల్పవృక్ష షాపింగ్ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన క్యూలైన్ ద్వారా దర్శనార్థమై లోపలికి ప్రవేశించారు. శ్రీమఠం ప్రధాన ఆర్చి వద్ద ఉన్న మరో క్యూలైన్ ద్వారా కూడా స్వామి వారిని దర్శించుకునేందుకు నిలిచారు. నూతన సంవత్సరం సందర్భంగా భక్తులు బస్సుల ద్వారా, ప్రయివేట్ వాహనాల్లోనూ, రైళ్ల ద్వారా లక్షల్లో తరలివచ్చారు. ప్రత్యేక సేవలు చేయించిన భక్తుల సమక్షంలో రాఘవేంద్రుని బృందావన ప్రతిమకు విశేష పూజలు నిర్వహించి మంగళ హారతులు స్వీకరించిన భక్తులకు, విఐపిలకు ప్రత్యేక దర్శన భాగ్యం కల్పించారు. శ్రీమఠం పరిధిలోని వసతి గృహాలు పూర్తిగా నిండి పోవడంతో ప్రయివేట్ లాడ్జీలను ఆశ్రయించి జేబులు ఖాళీ చేసుకున్నారు. ఇక హోటళ్లలో కూడా భోజనాలు దొరకని పరిస్థితి నెలకొంది.

రాఘవేంద్రుని సన్నిధిలో ప్రముఖులు

మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామిని ప్రముఖులు దర్శించుకున్నారు. కన్నడ సినీ నటులు, ఎంపీ జగ్గేష్, కన్నడ నటుడు శోభారాజ్, నెల్లూరు జిల్లా కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి స్వామి వారిని దర్శించుకుని మంగళ హారతులు స్వీకరించారు. దర్శనార్థం ఆలయం చేరుకున్న వారికి శ్రీమఠం ధార్మిక అధికారి శ్రీపతి ఆచార్, సహాయక పిఆర్ఒ హొన్నొళ్లి వ్యాసరాజాచార్, సిఆర్ఒ విజయీంద్ర చార్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మంగళ హారతులు స్వీకరించారు.

తిక్కారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

తిక్కారెడ్డికి సన్మానం

ప్రజాశక్తి - మంత్రాలయం

నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో టిడిపి జిల్లా మాజీ అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి, టిడిపి యువ నాయకులు పాలకుర్తి దివాకర్ రెడ్డికి గజమాల వేసి నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. గురువారం ఎమ్మిగనూరులోని తిక్కారెడ్డి నివాసంలో టిడిపి మంత్రాలయం మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి నేతృత్వంలో నాయకులు చిన్నభీమ, విజయరామిరెడ్డి, వట్టెప్పగారి నరసింహ, చిన్న సుంకప్ప, ఏబు, హనుమంతు, గణేకంటి గురురాజ్, సున్నం రఘు, రామకృష్ణ శుభాకాంక్షలు తెలిపి గజమాలతో సన్మానించారు.

సత్ప్రవర్తనతో మెలగాలి

- పాస్టర్ ఐక్యత రావు

ప్రజాశక్తి - ఆదోని

సత్ప్రవర్తనతో మెలుగుతూ జీవించేలా ప్రతి ఒక్కరూ ప్రణాళిక రూపొందించుకోవాలని పాస్టర్ ఐక్యత రావు తెలిపారు. పట్టణంలోని ఎస్‌కెడి కాలనీ సిఎస్ఐ హోలీ్ట్రినిటీ చర్చిలో పాస్టర్ డానియల్ బాబు ఆధ్వర్యంలో నూతన సంవత్సరం సందర్భంగా గురువారం ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. పాస్టర్ ఐక్యతరావు మాట్లాడుతూ... అందరూ ఇతరులకు ఉపయోగపడేలా జీవించాలని తెలిపారు. పాత అలవాట్లు, జ్ఞాపకాలు వదిలి కొత్త ఆలోచనతో జీవితం మొదలు పెట్టాలని సూచించారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుంటూ సంబరాలు చేసుకున్నారు. సంఘ పెద్దలు జానుబాబు, ప్రేమ్ కుమార్, తాయప్ప, ఏసోబు, అజయ్ ఉన్నారు.

కృష్ణమ్మకు నాయకుల శుభాకాంక్షలు

ప్రజాశక్తి - కౌతాళం

టిడిపి జిల్లా అధ్యక్షులు గుడిసె ఆది కృష్ణమ్మకు టిడిపి మండల నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గురువారం తుంగభద్ర బోర్డు ప్రాజెక్టు ఛైర్మన్ టిప్పు సుల్తాన్, సహకార సంఘం అధ్యక్షులు అల్లూరి వెంకటపతి రాజు, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి అడివప్ప గౌడ్, కౌతాళం పట్టణ అధ్యక్షులు రాజానందు, యువ నాయకులు సుల్తాన్, సుభాన్, గొట్టయ్య తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

కృష్ణమ్మకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ యూనియన్

ప్రజాశక్తి - ఆదోని

వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కార దిశగా కృషి చేస్తామని ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ యూనియన్ తాలూకా అధ్యక్షులు బాబురాజు తెలిపారు. గురువారం ఆదోని వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో యూనియన్ క్యాలెండర్‌ను డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం సూచించిన విధులను సక్రమంగా నిర్వర్తించి ప్రజలకు చేరువగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. యూనియన్ తాలూకా సెక్రటరీ శ్రీరాములు, ట్రెజరర్ వాసుదేవారెడ్డి, సెక్రటరీ చంద్రశేఖర్, సహాయ సెక్రటరీలు రాణి, విజయ, రవికుమార్, ఎపిఎన్‌జిఒ సభ్యులు మంజునాథ్, సీతారాముడు, థామస్, జ్ఞానేశ్వరి, మేరీ, అరుణ, రాధమ్మ, అజయ్ కుమార్, టిబి విభాగం ఉద్యోగులు భాస్కర్, పద్మావతి, సుబ్బమ్మ బాయి పాల్గొన్నారు.

మిల్క్ డైరీ ప్రొప్రైటర్ భీమన్నకు డైరీ యూత్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి - నందవరం

నందవరం మిల్క్ డైరీ ప్రొప్రైటర్ భీమన్నకు డైరీ యూత్ సభ్యులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గురువారం వారు నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. పూలమాలలు, శాలువాతో ఆయనను సన్మానించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. మిల్క్ డైరీ యూత్ సభ్యులు మాట్లాడారు. మంచి మనస్సున్న వ్యక్తి ప్రొప్రైటర్ భీమన్న అని కొనియాడారు. ఆయన స్థాపించిన డైరీ ద్వారా చాలా కుటుంబాలు ఉపాధిని పొందుతున్నాయని తెలిపారు. చాలామంది నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తూ ఆర్థిక భరోసా ఇచ్చారన్నారు. విధి నిర్వహణలో తాము ప్రమాదాలకు గురై నష్టాలు సంభవించిన సమయాల్లో 'నేనున్నాన'ంటూ ఆనందంగా నష్టాన్ని భరిస్తూ పలకరించే వ్యక్తి అని తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. గత 18 ఏళ్ల క్రితం గ్రామంలో మిల్క్ డైరీ ప్రారంభించామని, యువత సహాయంతో తమ డైరీ విజయవంతంగా కొనసాగుతోందని తెలిపారు. తక్కువ ధరలకు పాల ఉత్పత్తులను అందిస్తూ ప్రజల ఆదరణ పొందామన్నారు. యువత సహాయం, ప్రజల ఆదరణతో రాబోయే కాలంలో కూడా డైరీని విజయవంతంగా నిర్వహిస్తూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న సభ్యులు

ప్రజల జీవితాల్లో నూతన వెలుగు నిండాలి

- ఎమ్మెల్యే విరుపాక్షి

ప్రజాశక్తి - చిప్పగిరి

కొత్త సంవత్సరంలో నియోజకవర్గంలోని ప్రజలందరి జీవితాల్లో కొత్త వెలుగులు నిండాలని ఎమ్మెల్యే బి.విరుపాక్షి ఆకాంక్షించారు. గురువారం ఆయన హైదరాబాదు నుంచి ఫోన్‌లో మాట్లాడారు. ఈ కొత్త సంవత్సరం ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని, సరికొత్త విజయాలను అందించాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ సంతోషంగా జీవించాలని అన్నారు. నియోజకవర్గం ప్రజలకు, వైసిపి జడ్‌పిటిసిలకు, ఎంపిపిలకు, మండల కన్వీనర్లకు, పార్టీ అనుబంధ సభ్యులకు, వైసిపి నాయకులకు, కార్యకర్తలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

గ్రామాభివృద్ధే లక్ష్యం : వైసిపి

ప్రజాశక్తి - నందవరం

కుళాయిని ప్రారంభిస్తున్న నాయకులు

గ్రామాభివృద్ధే తమ లక్ష్యమని వైసిపి బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ముగతి విరుపాక్షిరెడ్డి తెలిపారు. గురువారం ముగతి గ్రామంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. రూ.12 లక్షలతో దర్గా వీధిలో సిసి రోడ్డు పనులను ప్రారంభించారు. అలాగే తాగునీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన నూతన కుళాయిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాభివృద్ధి కోసమే తమ కుటుంబం పని చేస్తోందన్నారు. తన తల్లి ఎంపిపి లక్ష్మీదేవమ్మ సహకారంతో ఎంపిపి, సర్పంచి నిధులతో సిసి రోడ్డు, తాగునీటి కుళాయి, వీధి లైట్లు ఏర్పాటు చేశామని తెలిపారు. ఉప సర్పంచి గణపతి, వార్డు సభ్యులు మాణిక్యం, నాగేష్, వైసిపి మండల ఉపాధ్యక్షులు రాఘవరెడ్డి, సోమశేఖర్ రెడ్డి, సోషల్ మీడియా బాబయ్య, రాజశేఖర్, తారక రాముడు, సోమనాథ్, రంగారెడ్డి, రామకృష్ణ, శ్రీరాములు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

హత్య కేసు నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి - ఆస్పరి

నిందితుని అరెస్టు చూపుతున్న సిఐ గంగాధర్

మండలంలోని తొగలగల్లు గ్రామంలో వదిన గంగావతిని హత్య చేసిన కేసులో గొల్ల పెద్దయ్యను అరెస్టు చేసినట్లు సిఐ గంగాధర్ గురువారం తెలిపారు. సిఐ వివరాల మేరకు... నిందితుడు పెద్దయ్య అన్న అహోబిలంను 2025 సెప్టెంబర్ నెలలో బెంగళూరుకు చెందిన చెన్నబసవ దొడగౌండ సమీపంలో ఉన్న డంపింగ్ యార్డ్ వద్ద హత్య చేశాడు. చెన్నబసవ, గంగావతితో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. అహోబిలం హత్యకేసులో గంగావతి, చెన్న బసవ ఇద్దరూ జైలుకెళ్లి అక్టోబర్ నెలలో బెయిల్‌పై బయటకు వచ్చారు. గంగావతి తొగలగల్లు గ్రామంలోని రేకుల షెడ్డులో నివాసం ఉండేవారు. నిందితుడు గొల్ల పెద్దయ్య గంగావతిని రాయి, రోకలి బండతో కొట్టి చంపాడు. అనంతరం మోటార్ బైక్ పై పారిపోయాడు. డిసెంబర్ 31న సాయంత్రం అరెస్టు చేసి హత్యకు ఉపయోగించిన మోటార్ బైక్, రోకలి బండను స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ రామాంజనేయులు, కానిస్టేబుల్ శ్రీను, మల్లికార్జున, అంజి, గిరి స్వామి, నాయక్ ఉన్నారు.

మహారాజశ్రీ రెండవ అదనపు జిల్లా జడ్జి కోర్టు
కర్నూలు అట్ ఆదోని
O.S.No. 4 / 2025

Between :
పి. ఖాసీమ్ సాబ్ ... వాది(Plaintiff)
V/s.
1.పి. శేక్షావలి
2.పి. హొన్నూర్ వలి
3.పి. ఖాసీమ్ సాబ్
4.పి. షాషా వలి
5.బొంతల కేశవయ్య
6.బొంతల నాగరాజు .... ప్రతివాదులు (Defendants)

ప్రతివాదులైన నెం.1 నుండి 4 లకు నోటీసులు

To
1. పి. శేక్షావలి S/o లేట్ చిన్న షేక్సబ్ (Defendant No.1) R/o పత్తికొండ టౌన్, కర్నూలు జిల్లా.
2. హొన్నూర్ వలిS/o లేట్ చిన్న షేక్సబ్ (Defendant No.2) R/o పత్తికొండ టౌన్, కర్నూలు జిల్లా.
3. పి. ఖాసీమ్ సాబ్ S/o లేట్ చిన్న షేక్సాబ్ (Defendant No.3) R/o పత్తికొండ టౌన్, కర్నూలు జిల్లా.
4. పి. షాషావలి S/o లేట్ చిన్న షేక్సబ్ (Defendant No.4) R/o పత్తికొండ టౌన్, కర్నూలు జిల్లా.
సెల్ : 9059176103

పై తెలిపిన వాది (Plaintiff) వారు ప్రతివాదులు (Defendants) నెం.1 నుండి 4 అయిన మీపైన పై కోర్టులో విభాగాల కొరకు దావా దాఖలు చేసియున్నారు. పై కోర్టు నుండి ప్రతివాదులు (Defendants) నెం.1 నుండి 4 అయిన మీకు చాలా సార్లు సమన్లు / నోటీసులు పంపిననూ తీసుకోనందున కోర్టు వారి ఆదేశాల మేరకు ఈ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయడమేమనగా పై దావాకు సంబంధించి వాయిదా తేది: 07-01-2026 ఉదయం 10.30 గంటలకు ప్రతివాదులు అయిన మీరు కోర్టుకు హాజరు కావలెనని, మీ తరఫున ఏమైనా ఆక్షేపణలు వున్నయెడల మీరు ఖుద్దుగా గాని, మీ వకీలు ద్వారా గాని కోర్టుకు హాజరై మీ అభ్యంతరాలను తెలుపవచ్చును. ప్రతివాదులు అయిన మీరు హాజరు కాని యెడల పై కోర్టు వారు పై కేసులో వాది (Plaintiff) పరముగా మీ పరోక్షమున తీర్మానము చేయుదురని ఈ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

//కోర్టు వారి ఆర్డరు మేరకు//

వాయిదా తేది : 07-01-2026

శ్రీ ఎం.ఎండి. ఇస్మాయిల్,
శ్రీ కె. అబ్దుల్ రహీమ్ అన్సారి,
వాది తరపు వకీళ్లు,
ఆదోని-518301.
సెల్ : 9848860389

కలెక్టర్‌కు జిజిహెచ్‌సూపరిన్‌టెన్‌డెంట్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

నూతన సంవత్సరం 2026 సందర్భంగా జిల్లా కలెక్టర్ క్యాంపు ఆఫీస్ లో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరికి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యాశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

సిఐకి ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కోడుమూరు

ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ నాయకులు లింగం బాలకృష్ణయ్య ముదిగుబ్బ సిఐ. పి.శ్యామరావుకు ఆయన నివాసంలో 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను శాలువా, పూలమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఇంకా ఉన్నత పదవులు స్వీకరించాలని మనస్ఫూర్తిగా కోరారు.

డిసిఎంఎస్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

నూతన సంవత్సర సందర్భంగా డిసిఎంఎస్ చైర్మన్ వై. నాగేశ్వర రావు యాదవ్ కర్నూలు కలెక్టర్ , జాయింట్ కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలసి కర్నూలు డిసిఎంఎస్ క్యాలండర్‌ను ఆవిష్కరించారు. త్వరలోనే ప్రారంభం కానున్న కందుల కొనుగోలు గురించి వివరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కర్నూలు డిసిఎంఎస్ అభివృద్ధి కోసం పలు కార్యక్రమాలు చేపట్టామని, త్వరలో జరగనున్న కందులు, మినుములు కొనుగోలు కు అన్ని రకాల సహాయ కార్యక్రమాలు అందించాలని కోరారు

8 వరకు పాసుపుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి-సి బెళగల్

నేటి నుండి బురాన్ దొడ్డి, పోలకల్, సంఘాల, మాల సోమాపురం, గుండ్రేవుల రెవిన్యూ పంచాయతీలలో భూపట్టా పాసుపుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు తహసీల్దార్ వెంకటలక్ష్మి పేర్కొన్నారు.ఈ నెల ఎనిమిది వరకు రెవిన్యూ పంచాయతీలలో గల సచివాలయంలలో సంబందించిన అధికారులు, ప్రజా ప్రతినిధులు తగు శ్రద్ద చూపి ఆసక్తిగా పాల్గొనాలని సూచించారు. రైతులు భూ పట్టా పాసు పుస్తకాలను అందుకోవాలని ఇంకా ఎవరైనా రైతులు భూ సమస్యలు ఉంటే వినతులు ఇవ్వాలని కోరారు.

జాయింట్ కలెక్టర్ దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతున్న సమాచారశాఖ డిడి జయమ్మ

టిడిపి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులకు పార్టీ శ్రేణులు శుభాకాంక్షలు

ప్రజాశక్తి కర్నూలు క్రైమ్

కర్నూలు జిల్లా టిడిపి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గుడిసె కృష్ణమ్మ, పూల నాగరాజులకు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని పార్టీ శ్రేణులు భారీ ఎత్తున పార్టీ జిల్లా కార్యాలయానికి తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ నాయకులు కార్యకర్తలు వారిని కలిసి పూల బొకేలతో, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు పార్టీ అభివృద్ధి కోసం సంక్షేమం కోసం కార్యకర్తలు కృషి చేయాలని ఎల్లవేళలా కార్యకర్తలకు అండగా ఉంటామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారాధ్యంలో కలిసి ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అంతకుముందుగా పార్టీ కార్యాలయంలో వారు భారీ

కేకును కట్ చేసి సంబరాలు నిర్వహించారు.

ఆర్యవైశ్యులకు అండగా కూటమి ప్రభుత్వం

- ప్రకాశం జిల్లా పొదిలిలో వ్యాపారి అవినాష్‌తో ఎస్ఐ అనుచిత ప్రవర్తన బాధాకరం - బాదితుడు అవినాష్‌ను ఫోన్లో పరామర్శించిన రాష్ట్ర మంత్రి టీజీ భరత్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఆర్యవైశ్యులకు ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. ప్రకాశం జిల్లా పొదిలిలో ఆర్యవైశ్యుడు యాదాల అవినాష్‌ను స్థానిక ఎస్ఐ కొట్టిన నేపథ్యంలో మంత్రి టిజి. భరత్ ..అవినాష్ తో ఫోన్లో మాట్లాడి పరామర్శించారు. ఘటనకు సంబంధించిన వివరాలు తెలుసుకొని ధైర్యం చెప్పారు. ఎస్ఐపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందన్నారు. ఎలాంటి కష్టమొచ్చినా వెంటనే తనను సంప్రదించాలని బాదితుడు అవినాష్‌కు మంత్రి టిజి భరత్ చెప్పారు. ఇలాంటి సంఘటన జరగడం ఎంతో బాధాకరమని మంత్రి టీజీ ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం ఇలాంటి వాటిని సహించదన్నారు. ఆర్యవైశ్యులకు ఇబ్బందులు లేకుండా తమ ప్రభుత్వం చూసుకుంటుందన్నారు. వ్యాపారులకు ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. ఆర్యవైశ్యులకు కూటమి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. తమ ప్రభుత్వం పెనుగొండను వాసవి పెనుగొండగా పేరు మార్చినట్లు మంత్రి టీజీ భరత్ గుర్తు చేశారు.

ఘనంగా జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం

ప్రజాశక్తి-క్రిష్ణగిరి

పత్తికొండ నియోజకవర్గం క్రిష్ణగిరి మండలంలో జనసేన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జనసేన మండల నాయకులు బోయ.పులి శేఖర్ ఈ చిరంజీవి గౌడ్ క్రిష్ణగిరి బస్టాండ్ జనసేన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. పులి శేఖర్ మాట్లాడుతూ పత్తికొండ నియోజకవర్గం క్రిష్ణగిరి మండలం ఎంతో ప్రతిష్టాత్మకమైన మండలమని, వీరు చేస్తున్న సేవా కార్యక్రమాలు ప్రజల్లోకి జనసేన పార్టీ తీసుకొని వెళ్లాలని ఆలోచన బలంగా ఉందన్నారు. మన మండలానికి జనసేన పార్టీ ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందన్నారు.కార్యాలయం మా కోసం కాదు ప్రజా సమస్యలు తెలుసుకోవడానికని, ప్రజలకు మరింత అందుబాటులో ఉండడానికని తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని

గమనించి సమస్యలు తప్పకుండా పార్టీ కార్యాలయానికి వచ్చి తెలపాలని కోరారు. కార్యక్రమంలో సి నాగేశ్వరరావు, బి తిరుపాల్, జనసేన నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ ఎమ్మెల్యే కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు టిడిపి నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. పత్తికొండ ఎమ్మెల్యే కెఇ. శ్యామ్ కుమార్ ను తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తిని లోకనాథ్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు సాంబశివరెడ్డి పత్తికొండ డిఎస్‌పి వెంకట్రామయ్య , మాదాసి మా దారి కురువ సంఘం నాయకులు సోమలింగడు, కెపి బ్రహ్మయ్య కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పత్తికొండ నియోజకవర్గం ప్రజలు విడివిడిగా కలిసి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు.

నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రామ్‌భూపాల్‌రెడ్డికి కోడుమూరు ఎమ్మెల్యేకు , కర్నూలు వైసిపికి అధ్యక్షుని శుభాకాంక్షలు తెలపుతున్న డాక్టర్ సుధాకర్

ప్రజాశక్తి క్యాలెండర్‌ను, డైరీని ఆవిష్కరిస్తున్న నగరూరు శమంతకమణి, కోడుమూరు ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలపుతున్న టిడిపి కార్యకర్తలు, అభిమానులు

వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్ఐ రామిరెడ్డి

నూతన సంవత్సరం రోజున విషాదం

- ముగ్గురు పిల్లలకు విషమిచ్చి ఆపై తండ్రీ ఆత్మహత్య

నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని ఉయ్యాలవాడ మండలం తుడుములదిన్నె గ్రామంలో నూతన సంవత్సరం రోజు విషాదం చోటుచేసుకుంది. తండ్రి తన ముగ్గురు పిల్లలకు విషమిచ్చి ఆపై తాను ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

వార్త మెయిన్‌లో

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

-జిల్లా కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన పలువురు అధికారులు -2026లో నంద్యాల జిల్లా అభివృద్ధికి సమిష్టి కృషి : కలెక్టర్

మంత్రి ఫరూక్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్పీ సునీల్ షేరాన్



శుభాకాంక్షలు తెలుపుతున్న జెసి కార్తీక్

ప్రజాశక్తి-నంద్యాల కలెక్టరేట్

జిల్లా వ్యాప్తంగా నూతన సంవత్సరం వేడుకలు ఘనంగా జరిగాయి. అర్ధరాత్రి 12 గంటలకు కొత్త సంవత్సరంలోకి అడుగు పెట్టడంతో పాత సంవత్సరంకు వీడ్కోలు పలుకుతూ 2026 కొత్త సంవత్సరానికి యువత స్వాగతం పలికింది. అర్ధరాత్రి బాణాసంచా పేల్చుతూ సంబరాలు చేసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు గట్టి భద్రత, నిఘాను ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం పలువురు అధికారులు, ఉద్యోగులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నంద్యాల జిల్లా కేంద్రంలో రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. బొమ్మల సత్రం వద్ద ఉన్న జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన నూతన సంవత్సర వేడుకలలో జిల్లా సర్వోన్నత అధికారి రాజకుమారి గణియాని జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్, జిల్లా రెవెన్యూ అధికారి రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహశీల్దార్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అధికారులందరిని ఆప్యాయంగా పలకరిస్తూ తిరిగి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గత సంవత్సరంలో జిల్లాలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ఫలితాలను గుర్తు చేస్తూ, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా అధికారులు కృషి చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. నూతన సంవత్సరం 2026లో నంద్యాల జిల్లాను అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకువెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజా సంక్షేమం, పారదర్శక పరిపాలన, సమర్థవంతమైన సేవల అందింపు దిశగా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా పేదలు, బలహీన వర్గాలు, మహిళలు, వృద్ధులు, దివ్యాంగులకు ప్రభుత్వ పథకాల లబ్ధి నేరుగా అందేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. రెవెన్యూ పరిపాలనలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా సత్వర సేవలు అందించాలన్నారు. భూ సమస్యల పరిష్కారం, రీ-సర్వే ప్రక్రియ, భూ హక్కుల పరిరక్షణ, పెన్షన్లు, గృహ నిర్మాణం, ఉపాధి కల్పన వంటి అంశాలలో అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. గ్రామీణ అభివృద్ధి, పట్టణ సౌకర్యాల విస్తరణ, తాగునీరు, పారిశుధ్యం, విద్య, వైద్య రంగాల్లో గుణాత్మక మార్పులు తీసుకురావాలని కోరారు. ఆరోగ్యవంతమైన సమాజమే అభివృద్ధికి పునాది అన్నారు. ప్రతి ఒక్కరు వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు ప్రజారోగ్యంపై ప్రత్యేకదృష్టి సారించాలని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేసే ప్రతి ఉద్యోగి ప్రజలతో సానుకూలంగా మెలిగి, సమస్యలను మానవీయ కోణంలో పరిష్కరించే దృక్పథం కలిగి ఉండాలని హితవు పలికారు. ఈ నూతన సంవత్సరంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు అందరూ కలిసికట్టుగా పనిచేస్తే నంద్యాల జిల్లాను అన్ని రంగాల్లో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దవచ్చని కలెక్టర్ విశ్వాసం వ్యక్తం చేశారు. జిల్లాను మరింత అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లే బాధ్యత ప్రతి ఒక్కరిదేనని గుర్తు చేస్తూ, 2026 సంవత్సరం నంద్యాల జిల్లాకు సుభిక్షం, సంక్షేమం, సమగ్ర అభివృద్ధి కలిగిన సంవత్సరంగా నిలవాలని ఆకాంక్షించారు. నంద్యాలలోని సిపిఎం కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్‌ను నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాల నాయకులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

హైకోర్టు న్యాయమూర్తితో ఆలయం ఈవో శ్రీనివాసరావు

శ్రీ స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

ప్రజాశక్తి- శ్రీశైలం ప్రాజెక్టు

శ్రీశైలం పుణ్యక్షేత్రాన్ని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి రవినాథ్ తిల్హారి దంపతులతో గురువారం శ్రీ స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ముందుగా హైకోర్టు న్యాయమూర్తి దంపతులకు ఆలయ ప్రధాన ద్వారం వద్దం ఆలయ మర్యాదలతో ఆలయం ఇఒ శ్రీనివాసరావు, అర్చక స్వాములు, వేదపండితులు స్వాగతం పలికారు. అనంతరము శ్రీ స్వామి అమ్మవార్ల దర్శనం తర్వాత అమ్మవారి ఆశీర్వచన మండపంలో స్వామి అమ్మవార్ల శేష వస్త్రం, ప్రసాదాలు, జ్ఞాపికను అందజేసి ఆశీర్వచనాలు పలికారు.

ఉద్యమాల వేగుచుక్క చిన్న సుబ్బయ్య: సిపిఎం

ప్రజాశక్తి - ఆత్మకూరు

నందికొట్కూరు ఆత్మకూరు ఉమ్మడి తాలూకా మార్క్సిస్టు పార్టీ ఉద్యమ నిర్మాతలో ఒకరైన ఆకుతోట చిన్న సుబ్బయ్య జీవితం నేటి తరం రాజకీయాలకు ఆదర్శం కావాలని సిపిఎం సీనియర్ నాయకులు ఎ.రాజశేఖర్, పట్టణ సీనియర్ నాయకులు ఎం.రజాక్, బిసి సంఘం నాయకులు వెంకటస్వామి గౌడ్, సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్, మండల కార్యదర్శి పి.సుధాకర్లు అన్నారు. గురువారం స్థానిక డాక్టర్ ఎ. ధనుంజయ మీటింగ్ హాల్ ఆకుతోట చిన్న సుబ్బయ్య 13వ వర్ధంతి సభను నిర్వహించారు. సందర్భంగా ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ఉమ్మడి తాలూకాలో సిపిఎం నిర్మించే దాంట్లో కీలక భూమిక పోషించిన వ్యక్తి ఇచ్చిన సుబ్బయ్య అన్నారు. జూపాడు బంగ్లా మండలంలో పారం భూములు 1500 ఎకరాలు 18 గ్రామాల ప్రజలకు పంపిన పంపిణీ చేసిన చరిత్ర సిపిఎం దని అన్నారు. ఆయనతోపాటు ఈ ప్రాంతంలో బత్తిని సుదర్శనం, తెప్పలి వెంకట్‌దాసు, యాదాటి శ్రీరాములు, నెమలిచిన్న వెంకటరెడ్డి, ఆత్మకూరు పట్టణంలో మహమ్మద్ అనీఫ్, గంజి నారాయణ తదితర నాయకులు తయారుచేసి మార్క్సిస్టు పార్టీ ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవడంలో కీలకపాత్ర పోషించాలని అన్నారు. నేటి తరం రాజకీయాలలో ఆస్తులను ఎలా సంపాదించుకోవాలని పద్ధతుల్లో పనిచేస్తున్న క్రమంలో చిన్న సుబ్బయ్య సొంత ఆస్తులను దాదాపు 60 ఎకరాలు పోగొట్టుకొని సిపిఎంలో పని చేసిన మహోన్నత వ్యక్తిని వారన్నారు. నేటి తరం యువత చిన్న సుబ్బయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. సిపిఎం పట్టణ నాయకులు ఎ. సురేంద్ర, జి.నాగేశ్వరావు, పి భాస్కర్, నాయకులు బిఎస్ వలి, ఎ. కలిముల్లా మహమ్మద్, గణపతి, అంబయ్య, రఫిక్, రమణ, నూరహమ్మద్,శ్యాలు పాల్గొన్నారు.

చిన్న సుబ్బయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

జాతీయ రోడ్డు భద్రత మాసం-2026 ప్రారంభం

- జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి

ప్రజాశక్తి-నంద్యాల కలెక్టరేట్

ప్రతి పౌరుడు ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించడమే నిజమైన రోడ్డు భద్రత అని, ప్రజల సహకారం , సమిష్టి కృషితోనే సురక్షిత రహదారులను సాధించవచ్చని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. గురువారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయ ఆవరణలో నూతన సంవత్సర సందర్భంగా జాతీయ రోడ్డు భద్రతా మాసం-2026 ప్రారంభోత్సవ బ్యానర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఎస్పి కార్యాలయంలో జిల్లా ఎస్పి సునీల్ షోరాణ్ రోడ్డు భద్రత బ్యానర్‌ను విడుదల చేశారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ రహదారులపై జరుగుతున్న ప్రమాదాలు అనేక కుటుంబాలను తీవ్రవిషాదంలోకి నెడుతున్నాయని తెలిపారు. ఇది కేవలం గణాంకాల అంశం కాదని, సమాజంగా మనందరి బాధ్యతగా భావించి మార్పు తీసుకురావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. 2024 సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయారని, ముఖ్యంగా యువత, ద్విచక్ర వాహనదారులు , పాదచారులు ఎక్కువగా ప్రభావితమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిలో రోడ్డు భద్రతపై సమగ్ర దృష్టి సారించడం అత్యంత అవసరమని తెలిపారు. ఈ ఏడాది జాతీయ రోడ్డు భద్రతా మాసం నినాదంగా ఎంపిక చేసిన“శిక్షతో భద్రత, సాంకేతికతతో పరివర్తన”, రోడ్డు భద్రత సాధనకు ఎంతో ప్రాసంగికమైనదని కలెక్టర్ పేర్కొన్నారు. శిక్షతో భద్రత అనగా ట్రాఫిక్ నిబంధనలను కఠినంగా అమలు చేయడం ద్వారా ప్రజల్లో బాధ్యతాయుతమైన వాహన చలనం అలవాట్లను పెంపొందించడమని వివరించారు. హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగం తప్పనిసరిగా ఉండాలని, మద్యం సేవించి వాహనం నడపకూడదన్న స్పష్టమైన సందేశం ప్రతి ఒక్కరికి చేరాల్సిన అవసరం ఉందని తెలిపారు. జిల్లా ఎస్పి సునీల్ షోరాణ్ మాట్లాడుతూ సాంకేతికతతో పరివర్తన అనగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి రోడ్డు ప్రమాదాలను ముందుగానే నివారించడమని పేర్కొన్నారు. ఎఐఆధారిత కెమెరాలు, స్పీడ్ మానిటరింగ్ వ్యవస్థలు, ప్రమాదకర ప్రాంతాల (బ్లాక్ స్పాట్స్) గుర్తింపు, స్మార్ట్ ట్రాఫిక్ సిగ్నల్స్ వంటి చర్యల ద్వారా రోడ్డు భద్రతను మరింత బలోపేతం చేయవచ్చని వివరించారు. రోడ్డు భద్రత లక్ష్య సాధనకు పోలీస్, ఆర్ అండ్‌బి, వైద్య ,ఆరోగ్య శాఖ, పంచాయతీరాజ్, మునిసిపల్ శాఖలు, ఎపిఎస్ఆర్‌టిసి ఎన్‌హెచ్ఎ తదితర అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఎస్పి సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసం సందర్భంగా జిల్లాస్థాయిలో రోడ్డు ప్రమాదాల తగ్గింపుకు కొలిచే లక్ష్యాలను నిర్దేశించుకొని, జీరో ఫాటాలిటీ దిశగా ముందడుగు వేయాలని కలెక్టర్, ఎస్పీలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప రవాణా అధికారి శివారెడ్డి ఆర్అండ్‌బి ఎస్ఇ శ్రీధర్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి

- ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ సంఘాల నాయకులు

ప్రజాశక్తి - నంద్యాల

రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ సంఘాల నాయకులు పేర్కొన్నారు. గురువారం నంద్యాల పట్టణంలోని బొమ్మల సత్రం అంబేద్కర్ విగ్రహం వద్ద భీమా కోరేగావ్ యుద్ధ వీరులకు విజయోత్సవ సంబరాల కార్యక్రమం మాల మహానాడు రాష్ట్ర నాయకులు కడియం సాంబశివుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు దండు వీరయ్య, నంద్యాల ముస్లిం జేఏసీ అబులైజ్, ఎస్డీపీఐ ఎజాస్ హుస్సేన్, టీ.కరిముల్లా, మజీద్ ఖాన్ రిజర్వేషన్ పోరాట సమితి బి శ్రీనివాసులు, బిఎస్ఐ అధ్యక్షులు రెడ్డి పల్లె ఓపయ్య తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవ స్వామికి విశేష అలంకరణ

ప్రజాశక్తి - శిరివెళ్ల : మండలంలోని కోటపాడు గ్రామంలోగ్రూప్ దేవాలయంలో శ్రీ చెన్నకేశవ వీరభద్ర శివాలయంలో స్వామి వారికి విశేష అలంకరణ చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రూప్ దేవాలయాల ప్రధాన అర్చకులు కె.శ్రీనివాసాచార్యులు స్వామివారి తీర్థప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ప్యాపిలి : ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి తెలిపారు. గురువారం డోన్ పట్టణంలోని టిడిపి కార్యాలయంలో నిర్వహించిన నూతన సంవత్సర వేడుకలకు ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి హాజరై మాట్లాడారు. నూతన సంవత్సరం రాష్ట్ర ప్రజలందరికీ సుఖ సంతోషాలు, ఆరోగ్యం, అభివృద్ధిని తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కోట్ల

ప్రజాశక్తి ప్రజల పత్రిక : టిడిపి

ప్రజాశక్తి - మిడుతూరు

ప్రజాశక్తి దినపత్రిక ప్రజల పత్రిక అని టిడిపి మండల కన్వీనర్ ఖాతా రమేష్ రెడ్డి, సీనియర్ నాయకులు ఖాతా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం మిడుతూరులో ప్రజాశక్తి నూతన సంవత్సర క్యాలెండర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాశక్తి దినపత్రిక ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా పని చేస్తుందన్నారు. ప్రభుత్వం చేసే తప్పు ఒప్పులను నిర్భయంగా వార్తలు ప్రచురింపచేస్తుందని అన్నారు. ప్రజాశక్తి విలేకరులు నియోజకవర్గంలో ఎక్కడైనా ఏవైనా సంఘటనలు జరిగితే త్వరగా స్పందించి రాస్తారన్నారు. అనంతరం మండలంలోని టిడిపి నాయకులందరూ ఖాతా రమేష్ రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రంగస్వామి, లక్ష్మీనారాయణ, కుమారస్వామి, తిరుపాలు, సాయి, వెంకటేశ్వర్లు, పూజారి శేషయ్య, జమాల్ బాషా, ఇంతియాజ్, జనార్ధన్, బుస గౌడ్, ఈడ కిష్టన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం : సిపిఎం

ప్రజాశక్తి - ప్యాపిలి

ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమయిందని సిపిఎం నాయకులు విమర్శించారు. గురువారం స్థానిక సిపిఎం కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీనియర్ నాయకులు కొండయ్య కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి నక్కిశ్రీకాంత్, నాయకులు చిన్న రహిమాన్, షేమిమ్ బేగం, నక్కీ హరి, సిరినా, మాధవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్నా ప్రజాసమస్యలు పరిష్కరించడంలో పూర్తి విఫలమయిందన్నారు. నూతన సంవత్సరంలో పట్టణ, మండల ప్రజల జీవితాలలో వెలుగులు నిండి సుఖశాంతులతో ఉండాలని, రైతుల పంటలకు గిట్టుబాటు ధరలు, వ్యవసాయ కూలీల ఉపాధి అవకాశాలు కలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆదినారాయణ, సుధాకర్, బీబీ, కల్యాణి, కవిత, లక్ష్మీదేవి, నాగలింగం, అశోక్, హబీబ్, శ్రీను, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

సైనిక విభాగంలో మారేమడుగుల వాసికి ప్రమోషన్

ప్రజాశక్తి - అవుకు

అవుకు మండలంలోని మజరా గ్రామం మారేమడుగుల వాసి ఉల్లెమ్మ గారి జనార్దన్ రెడ్డికి కేంద్ర సైనిక విభాగంలో సుబేదార్ మేజర్‌గా గురువారం ప్రమోషన్ లభించింది. మారేమడుగులకు చెందిన చిన్నపురెడ్డి, లక్ష్మీదేవిలకు నలుగురు సంతానం. రెండో కుమారుడు జనార్దన్ రెడ్డి 26 సంవత్సరాల క్రితం సైనిక విభాగంలో (ఆర్మీ క్లర్క్‌గా) చేరి బెంగుళూరు, ధీమాపూర్, జలంధర్, మైసూర్, ఢిల్లీ, జమ్మూ, కాలింగ్ ఫాంగ్, రాజస్థాన్, శ్రీనగర్ వంటి ప్రాంతాల్లో నాయక్, హవల్దార్, నాయక్ సుబేదార్, సుబేదార్ హోదాల్లో విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం గుజరాత్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఈయనకు కేంద్రం నుండి సుబేదార్ మేజర్‌గా ప్రమోషన్ ఇచ్చారు. ఈ మేరకు కేంద్రం నుండి ఉత్తర్వులు రావడంతో జనవరి 1న ఐజి, డిఐజి, కల్నల్ స్థాయి అధికారుల చేతుల మీదుగా ప్రమోషన్ పొందారు. మారుమూల గ్రామవాసికి ప్రమోషన్ రావడం పట్ల మిత్రులు, బంధువులు, పలువురు ప్రముఖులు ఆనందం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులను అభినందించారు.

మేజర్‌గా ప్రమోషన్ పొందడంతో బ్యాడ్జీలు పెడుతున్న ఉన్నతాధికారులు

ఎమ్మెల్యేను కలిసిన లక్ష్మాపురం నాయకులు

ప్రజాశక్తి - పగిడ్యాల

మండలంలోని లక్ష్మాపురం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు షమీన్ (సిఎం) మద్ది రెడ్డి గౌడ్, కుమ్మరి గోవిందు, అయ్యన్న తదితరులు నూతన సంవత్సర వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. అల్లూరు గ్రామంలో టిడిపి జిల్లా నాయకులు మాండ్ర శివానంద రెడ్డి, ఉమాదేవి దంపతులను, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్యలను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పాణ్యం ఎమ్మెల్యే, నంద్యాల అధ్యక్షులు గౌరు చరిత, గౌరు వెంకట్ రెడ్డి, గౌరు జనార్దన్ రెడ్డిలను కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతున్న లక్ష్మాపురం నాయకులు

సమాధి వద్ద నివాళులర్పిస్తున్న చల్లా కుటుంబ సభ్యులు

ఘనగా చల్లా వర్ధంతి వేడుకలు

ప్రజాశక్తి - అవుకు : దివంగత ఎమ్మెల్సీ చల్లా రామకృష్ణారెడ్డి ఐదవ వర్ధంతి వేడుకలు అవుకు పట్టణంలోని చల్లా ఫామ్ హౌస్‌లో గురువారం నిర్వహించారు. ఆయన పెద్ద కుమారుడు, వైసిపి రాష్ట్ర లెజిస్లేటివ్ కౌన్సిల్ మెంబర్ చల్లా విగ్నేశ్వర్ రెడ్డి తండ్రి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సోదరులు చల్లా సూర్యప్రకాశ్ రెడ్డి, ఎంపీపీ చల్ల రాజశేఖర్ రెడ్డి, చల్లా భాస్కర్ రెడ్డి, చల్లా అమర్నాథ్ రెడ్డి, చల్లా రఘునాథరెడ్డి, పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, దుగ్గిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, చల్లా విక్రాంత్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి చల్లా సమాధికి, విగ్రహానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దత్తాత్రేయ స్వామికి విశేషపూజలు

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్ : శ్రీశైల దేవస్థానం ఆలయ ప్రాంగణంలో ఉన్న దత్తాత్రేయస్వామికి గురువారం విశేష పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతిపూజను చేశారు. ఆ తరువాత దత్తాత్రేయ స్వామికి పంచామృతాభిషేకం, విశేషపూజలు నిర్వహించారు.

అపెక్స్ పరస్పర సహకార పొదుపు పరపతి సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని శివరాం టాకీస్ దగ్గరలో ఉన్న అపెక్స్ పరస్పర సహాయక సహకార పొదుపు, పరపతి సంఘం లిమిటెడ్ క్యాలెండర్‌ను గురువారం ఎపిడబ్లుజెఎఫ్ జిల్లా కన్వీనర్ జి.మద్దయ్య యాదవ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అపెక్స్ మ్యాక్స్ సొసైటీ సీఈఓ సుగశెట్టి, బాలయ్య, మేనేజర్ గడ్డం ముని, డాక్టర్ బాబురావు, కమిటీ సభ్యులు రాజు, పుల్లయ్య, కస్టమర్లు సి.శ్రీనివాసులు, మౌలాలి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ దూదేకుల ఖాసీం, ఆటో మాలిక్ తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ను ఆవిష్కరిస్తున్న నాయకులు

డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓలు

ఎస్‌టియు డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - చాగలమర్రి

మండల కేంద్రంలోని ఎంఆర్‌సి కార్యాలయం వద్ద ఎంఈఓలు అనూరాధ, న్యాతంతుల్లాలు ఎస్‌టియు డైరీ, ఇంట్రెస్ట్రీ క్యాలెండర్, కాన్టెస్ట్ క్యాలెండర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో ఉద్భవించిన మొట్టమొదటి ఉపాధ్యాయ సంఘంగా పలు ఉద్యమాలు, పోరాటాలకు సారథ్యం వహించి ఎన్నో ఫలితాలను సాధించడంలో పెద్ద పాత్ర పోషించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివశంకర్,మండల శాఖ అధ్యక్షులుగా గురు చంద్రుడు,ప్రధాన కార్యదర్శి మస్తాన్ భాష,ఆర్థిక కార్యదర్శి మాబుహుసేన్, ఎస్‌టియు నాయకులు నరసింహుడు, అంబటి రాజశేఖర్ రెడ్డి, శేషాద్రి, శ్రీనివాసులు, సురేష్‌లు, ఎంఆర్‌సి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు మరింత వేగవంతం

- రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ మౌలానా షేక్ ముస్తాక్ అహ్మద్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నూతన సంవత్సరంలో అభివృద్ధి పనులు మరింత వేగవంతం చేస్తుందని రాష్ట్ర మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా షేక్ ముస్తాక్ అహ్మద్ తెలిపారు. గురువారం నంద్యాల పట్టణంలోని పద్మావతి నగర్‌లో ఆయనను తన కార్యాలయంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి స్థానిక నాయకులు, మైనార్టీ సెల్ ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మౌలానాకు శుభాకాంక్షలు తెలుపుతున్న పార్టీ శ్రేణులు, అభిమానులు

కలెక్టర్‌ను కలిసిన జిల్లా అధికారులు

కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న డిఆర్‌ఒ

కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఆర్‌డిఒ, ఆర్అండ్‌బి ఈఈ

చదువుతో పాటు విలువలు నేర్పించాలి

ప్రజాశక్తి - పాణ్యం

విద్యార్థులకు చదువు, సంస్కారంతో పాటు భారతీయ సంప్రదాయాన్ని కూడా నేర్పించాలని విజయనికేతన్ విద్యాసంస్థల డైరెక్టర్ విజయకుమార్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక పాఠశాలలో జరిగిన నూతన సంవత్సర, ముందస్తు సంక్రాంతి సంబరాలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సంప్రదాయాలకు భారతదేశం పుట్టినిల్లు అన్నారు. ఆ సంప్రదాయాలు కనుమరుగు కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత భావితరాలదే అన్నారు. కాబట్టి ఉపాధ్యాయులు భారతీయ సంప్రదాయాలను విద్యార్థులకు వివరించాలని కోరారు. జయనికేతన్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మురళీధర చౌదరి మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకలు, సంక్రాంతి సంబరాలు విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతాయని అన్నారు. విజయ్ కుమార్ రెడ్డి, ఆయన సతీమణి సంధ్యారాణి కలిసి చిన్నపిల్లలకు భోగి పండ్లు పోశారు. అలాగే హరిదాసును సత్కరించారు. పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. సంప్రదాయబద్ధమైన పల్లెటూరి వాతావరణ సెట్టింగులు కూడా చూపరులను ఆకర్షించింది. కార్యక్రమంలో హాస్టల్ ఇన్చార్జ్ రాజశేఖర్ రెడ్డి, డీన్ సునీల్, అకాడమిక్ ఇంచార్జ్ మురారి, కోఆర్డినేటర్లు బ్రహ్మం, జహీర్ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నూతన సంవత్సర సంబరాలలో విజయనికేతన్ డైరెక్టర్ విజయ కుమార్ రెడ్డి

4న బహిరంగ సభను జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి-ప్యాపిలి

ఈ నెల 4న విశాఖలో జరిగే సిఐటియు జాతీయ మహాసభల బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆ సంఘం పట్టణ అధ్యక్ష కార్యదర్శులు బి.మాణిక్యం శెట్టి, టి.శివరాం కోరారు. గురువారం స్థానిక కొండపేటలోని సిఐటియు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. అనంతరం ప్రముఖ న్యాయవాది నాగభూషణం రెడ్డి మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కమిషనర్‌తో కార్మిక సమస్యలపై చర్చించారు. సాయంత్రం పాత బస్టాండ్ ప్రాంతంలో మహాసభల కరపత్రాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సీనియర్ నాయకులు జి.కొండయ్య, మండల కన్వీనర్ ఏవి. భాస్కర్ రెడ్డి, కో కన్వీనర్ బి.నాగముద్దయ్య, పట్టణ కోశాధికారి య.శ్రీనివాసులు, రామచంద్రుడు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

అవార్డు అందుకుంటున్న డీన్ అశోక్ కుమార్

ఆర్‌జిఎం డైరెక్టర్‌కు ఎడ్యుకేషన్ ఛేంజ్ మేకర్ అవార్డు

ప్రజాశక్తి - పాణ్యం

మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ డివి అశోక్ కుమార్ ఎడ్యుకేషన్ ఛేంజ్ మేకర్ అవార్డు అందుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్ర ప్రసాద్ తెలిపారు. గురువారం కళాశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతేడాది డిసెంబర్ 30న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అనుబంధ సంస్థ ఐసిటి అకాడమీ ఆధ్వర్యంలో విజయవాడలో జరిగిన అవార్డు ప్రధాన ఉత్సవ కార్యక్రమంలో ఆయనకు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మండలి చైర్మన్ డాక్టర్ కె.మధుమూర్తి, కాకినాడ జేఎన్టీయూ వైస్ ఛాన్సలర్ సిఎస్ ఆర్కె ప్రసాద్, ఐసిటి సీఈవో వి.శ్రీకాంత్ చేతులమీదుగా ప్రతిష్టాత్మక ఎడ్యుకేషన్ ఛేంజ్ మేకర్ అవార్డును ప్రదానం చేశారన్నారు. ఈ సందర్భంగా అశోక్ కుమారును ఆర్జీఎం విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎం.శాంతి రాముడు, ఎండి శివరాం, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

3న వార్షిక ఆరుద్రోత్సవం

ప్రజాశక్తి -శ్రీశైలం ప్రాజెక్ట్

శ్రీశైలంలో ఈ నెల 3న స్వామివారికి వార్షిక ఆరుద్రోత్సవం నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాన్ని పురస్కరించుకుని 2వ తేదీ రాత్రి 10 గంటల నుండి స్వామివారికి మహాన్యాస పారాయణ, లింగోద్భవకాల ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, 3వ తేదీన తెల్లవారుజామున స్వామిఅమ్మవార్ల ప్రాత:కాల పూజల అనంతరం నందివాహన సేవ, గ్రామోత్సవం జరిపించనున్నారు.

'నేనొక విశ్వ వ్యాపకుడను' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - నంద్యాల : మహర్షి వాల్మీకి సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో నంద్యాల ప్రముఖ కవి కొప్పుల ప్రసాద్ రచించిన 'నేనొక విశ్వ వ్యాపకుడను' కవితా సంపుటి ఆవిష్కరణ కార్యక్రమం గురువారం హైదరాబాద్‌లోని చిక్కడపల్లి త్యాగరాజ గానసభలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ విడి. రాజగోపాల్ అధ్యక్షత వహించారు. డాక్టర్ ఎం.నరసింహప్ప పుస్తకాన్ని ఆవిష్కరించారు. రిటైర్డ్ ఫారెస్ట్ ఆఫీసర్, ప్రముఖ కవితా సమీక్షకులు ఎ.యల్. కృష్ణారెడ్డి పుస్తక సమీక్ష చేశారు.

ఘనంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల : మండలంలోని కనకాద్రిపల్లి గ్రామంలో అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహానికి గురువారం గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ కన్వీనర్ విఆర్ లక్ష్మిరెడ్డి, గ్రామ పెద్దలు పి.వెంకట మల్లారెడ్డి, సర్పంచి బోయ శివశంకర్, తలారి ఓబులేసు, పెద్దిరెడ్డి, చిన్నరామిరెడ్డి, జిసి రాముడు, జి మద్దిలేటి, మాజీ సర్పంచ్ పెద్దవెంకటేష్, ఉపసర్పంచ్ రామలక్ష్మన్న, ఎంపిటిసీ పెద్దన్న, శివారెడ్డి, సుదర్శన్ ,మిద్దె ఓబులేసు, గురువు గౌడ్ స్వామి, సుబ్బారాయుడు స్వామి, అయ్యప్ప మాలాధారులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి గ్రామోత్సవంలో పాల్గొన్న నాయకులు

కిటికిటలాడిన రాజకీయ ప్రముఖుల నివాసాలు


ఎమ్మెల్యే భూమా అఖిలప్రియకు పూలమాల వేస్తున్న నాయకులు

మాజీ విప్ గంగుల ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డిలకు గజమాల వేస్తున్న నాయకులు


జనసేన నాయకులు ఇరిగెల సోదరులను సన్మానిస్తున్న అభిమానులు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డలో రాజకీయ ప్రముఖుల నివాసాలు నాయకులు, అభిమానులతో, కార్యకర్తలతో కిటకిటలాడాయి. ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ నివాసంలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియతో పాటు ఆమె సోదరుడు తాలూకా టిడిపి యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి లకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులు ,అనధికారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అలాగే గంగుల నివాసంలో మాజీ శాసనమండలి విప్, కర్నూలు పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకులు గంగుల ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్ర రెడ్డి లకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు పెద్ద సంఖ్యలో నాయకులు కార్యకర్తలు తరలివచ్చారు. జనసేన తాలూకా నాయకులు ఇరిగెల నివాసంలో జనసేన తాలూకా అధికార ప్రతినిధి ఇరిగెల సూర్యనారాయణ రెడ్డి, ఇరిగెల రామచంద్రారెడ్డిలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. వారికి గజమాలలు వేసి ఆనందాన్ని చాటుకున్నారు.

న్యాయమూర్తులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన న్యాయవాదులు

ఆళ్లగడ్డలో జూనియర్ సివిల్ జడ్జి భాస్కర్‌ను న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సరాల శుభాకాంక్షలు తెలిపారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శివప్రసాదరావు, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు రమణయ్య ఆధ్వర్యంలో, బార్ అసోసియేషన్ అధ్యక్షులు శివరామిరెడ్డి ఆధ్వర్యంలో న్యాయవాదులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఐదవ అదనపు జిల్లా ఇన్చార్జి జడ్జి అమ్మన్న రాజాను నంద్యాలలో ఏపీపీ శివప్రసాదరావు, రమణయ్య ఆధ్వర్యంలో న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

న్యాయమూర్తి అమ్మన్న రాజాకు శుభాకాంక్షలు తెలుపుతున్న న్యాయమూర్తులు

జూనియర్ సివిల్ జడ్జి భాస్కర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న న్యాయ మూర్తులు

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి - ఆత్మకూరు

ఆత్మకూరు పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో నూతన సంవత్సర వేడుకలను ప్రజలు అట్టహాసంగా జరుపుకున్నారు. పలు రాజకీయ పార్టీ నాయకులు, అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి శుభాకాంక్షలు స్వీకరించారు. సిపిఎం కార్యాలయంలో ఆ పార్టీ కార్యకర్తలను కేకులు కట్ చేవారు. స్థానిక టిడిపి కార్యాలయం వద్ద శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ప్రజలకు అందుబాటులో ఉండడంతో నియోజకవర్గంలోని అన్ని మండలాల అధికారులు, పార్టీ కార్యకర్తలు వచ్చి శుభాకాంక్షలు తెలిపారు. **వెలుగోడు :** వెలుగోడు మండలంలో నూతన సంవత్సర వేడుకలను ప్రజలు గురువారం ఘనంగా జరుపుకున్నారు. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డిని ఆయన స్వగ్రామం వేల్పనూరులో ఉదయాన్నే నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున చేరుకొని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో సమన్వయకర్త అన్నారపు శేసిరెడ్డి కేక్ కట్ చేశారు. ఐటిడిపి నాయకులు హుస్సేన్ సాహెబ్, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. **సంజామల/కోవెలకుంట్ల :** ఆయా మండలాల్లోని అన్ని గ్రామాల్లో యువకులు రాత్రి 12 గంటల తర్వాత కేకులు కట్ చేసి, బాణసంచాలు పేల్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. **అవుకు** మండలంలోని రామాపురం గ్రామంలో టిడిపి సీనియర్ నాయకులు ఐవి పక్కీరా రెడ్డి, మండల అధ్యక్షుడు ఐవి ఉగ్రసేనారెడ్డిలను నాయకులు, కార్యకర్తలు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గజమాలను క్రేన్ ద్వారా నాయకులకు వేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. **చాగలమర్రి :** మండల కేంద్రంలోని మెయిన్ బజార్‌లోని టిడిపి కార్యాలయంలో రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు అన్సర్ బాషాను నాయకులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. **నంద్యాల :** స్థానిక కళారాధన, వికలాంగుల సంక్షేమ సంఘం, ఐఎంఎ, లయన్స్ క్లబ్, క్రీడా సమాఖ్య కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యాలయానికి వచ్చిన వారికి మిఠాయిలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. **బనగానపల్లె :** టిడిపి వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్యకు ఆర్యవైశ్య సంఘం నాయకులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

నాయకులు లేక సప్పగా సాగిన వేడుకలు : పట్టణంలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, వారి కుటుంబ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, వారి కుటుంబ సభ్యులు నూతన సంవత్సర వేడుకలకు దూరంగా ఉండడంతో పట్టణంలో వేడుకలు సందడి లేకుండా పోయింది.

నందికొట్కూరు టౌన్ : నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డిని మున్సిపల్ కమిషనర్ జి.వెంకటరామి రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చైర్మన్‌కు ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. మున్సిపల్ మేనేజర్ సుహృలత, డీఈఈ నాసీర్, ఏఈ దినేష్ కుమార్, టౌన్ ప్లానింగ్ అధికారి రంగస్వామి, మున్సిపల్ ఆప్కాస్‌ఉద్యోగులు చైర్మన్ కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యే, మాండ్రకు డిఎస్‌పి, సిఐల శుభాకాంక్షలు

ఆత్మకూరు డిఎస్పి రామాంజి నాయక్, నందికొట్కూరు రూరల్, టౌన్ సిఐలు సుబ్రహ్మణ్యం, ప్రవీణ్ కుమార్ రెడ్డిలు గురువారం అల్లూరు గ్రామంలో నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య, టిడిపి పార్లమెంట్ ఇన్చార్జి మాండ్ర శివానందరెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వివిధ మండలాల ఎస్సైలు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పగిడ్యాల : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. జడ్పిటిసి పుల్యాల దివ్య, ఎంపీడీవో సుమిత్రమ్మ ఆధ్వర్యంలో అధికారులు, సచివాలయ సిబ్బంది కేకు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాలలో ప్రజలు నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. **ప్యాపిలి :** ఎంఎస్ఆర్ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి పాల్గొని మాట్లాడారు. ప్రజలు ఆయు ఆరోగ్యాలతో ఉండాలని, సుఖ సంతోషాలతో జీవించాలని కోరారు. కార్యక్రమంలో చిన్న నాగిరెడ్డి, యువ నాయకుడు గౌతమ్ కుమార్ రెడ్డి, భరత్ రెడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు. **రుద్రవరం :** మండలంలోని పలు గ్రామాలలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రజలందరూ కోటి ఆశలతో 2026 నూతన సంవత్సరానికి ఘన స్వాగతం పలికారు. వేడుకల్లో చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. **పాములపాడు :** మండలంలోని పలు గ్రామాలలో పిల్లలు, పెద్దలు, యువత, నాయకులు, కార్యకర్తలు నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పాములపాడు ఎస్ఐ పి తిరుపాలును బరిగల తిమ్మయ్య, కలబండి ప్రతాప్, దరగయ్య, మేకల విజయభాస్కర్, మురహరి బీరయ్య తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. **శిరివెళ్ల :** మండలంలోని బోయలకుంట్ల గ్రామంలో నూతన సంవత్సరం సందర్భంగా రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్ కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి నివాసం నాయకులు, అభిమానులతో కికిక్కిరిసిపోయింది. కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. టిడిపి సీనియర్ నాయకులు సూరా రామ, యువనేత బిసి ఫీదా, కొత్తపేట జక్రియా బ్రదర్స్, సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, ప్రముఖులు పాల్గొన్నారు. అనంతరం కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి మండలంలోని పలువురు నాయకులు, కార్యకర్తలు, అనుచరులతో కలిసి భారీ ఎత్తున ఆళ్లగడ్డకు చేరుకుని ఎమ్మెల్యే అఖిలప్రియని కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

కొలిమిగుండ్ల : టిడిపి మండల అధ్యక్షుడు మూలేరామేశ్వర్ రెడ్డి నివాసంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మంద విజయ్ కుమార్, మండల నాయకులు కళ్యాణ్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, గులి నాగేశ్వర్ రెడ్డి, లోకే పల్లె మధుసూదన్ రెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్షులు గొంగటి హుసేన్ రెడ్డి, నంద్యాల ప్రసాద్, ఎస్ రామ్మోహన్ నాయక్, టైలర్ రాము, సత్యం రెడ్డి, రాజగోపాల్ యాదవ్ పాల్గొన్నారు

చింతలాయపల్లెలో నూతన సంవత్సరం వేడుకల్లో పాల్గొన్న విండో అధ్యక్షులు అంబటి వివేకానంద రెడ్డి

చింతలాయపల్లె గ్రామంలో నూతన సంవత్సరం వేడుకలను విండో అధ్యక్షులు అంబటి వివేకానంద రెడ్డి ఘనంగా నిర్వహించారు. టిడిపి నాయకులు అంబటి జయలక్ష్మి రెడ్డి ఆహ్వానం మేరకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి దస్తగిరి బాబు మరియు డిప్యూటీ ఎంపీడీవో చంద్రమౌళి గౌడ్‌లతో కలిసి అంబటి వివేకానంద రెడ్డి కేక్ కట్ చేశారు. పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న మహిళలు

వెలుగోడు : ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న చిన్నారి


అవుకులో...


చాగలమర్రిలో...

నందికొట్కూరు : చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కమిషనర్

బనగానపల్లె : టంగుటూరి శీనయ్యను సన్మానిస్తున్న నాయకులు

నందికొట్కూరు : మాండ్రకు శుభాకాంక్షలు తెలుపుతున్న డిఎస్‌పి, సిఐలు

పగిడ్యాల : కేక్ కట్ చేస్తున్న జడ్పిటిసి పుల్యాల దివ్య, అధికారులు

రుద్రవరం : నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

పాణ్యంలో..

బనగానపల్లెలో పట్టణ సిఐ ప్రవీణ్ కుమార్, ఎస్సైలు దుగ్గిరెడ్డి, కల్పనలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రజలు

ప్యాపిలి : నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న ధర్మవరం సుబ్బారెడ్డి

పాములపాడులో..

నంద్యాలలో మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న వైసిపి శ్రేణులు

శిరివెళ్ల : ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి

కొలిమిగుండ్ల : మూల రామేశ్వర్ రెడ్డికి పూలమాలలు వేస్తున్న టిడిపి యువ నాయకులు

కేక్ కట్ చేస్తున్న అంబటి వివేకానంద రెడ్డి

శిరివెళ్ల : కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, సొసైటీ చైర్మన్ కాటంరెడ్డి అరుణమ్మ దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

నంద్యాలలో..